http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 7 జూలై 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## ధరణి అక్రమాలపై
# సీఐడీ!

- మొత్తం 8 లక్షల లావాదేవీల పరిశీలన
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో 22 వేల అనుమానాస్పద లావాదేవీల గుర్తింపు
- 15 రోజుల్లో నివేదిక సమర్పించనున్న ప్రత్యేక అధికారుల కమిటీ
- నివేదిక అనంతరం లోతైన దర్యాప్తు జరిపించే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్

బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూముల రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై లోతైన దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఫోరెన్సిక్ ఆడిటింగ్‌తో పాటు ప్రత్యేక కమిటీ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.. ఈ రెండు నివేదికల ఆధారంగా తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా సీఐడీ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని - మిగతా3లో



## ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా

- హైదరాబాదీ స్టార్టప్ ఘనత
- ఆర్మీ, హోం శాఖ కీలక పరీక్షలను పూర్తిచేసిన 'ఉగ్రం' రైఫిల్
- హైదరాబాద్‌కు చెందిన 'ద్విప డిఫెన్స్, డీఆర్‌డీఓ సంయుక్తంగా అభివృద్ధి
- సీఆర్పీఎఫ్, ఐటీబీపీ వంటి కేంద్ర బలగాల్లోకి ప్రవేశానికి మార్గం సుగమం
- ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశీయంగా తయారీ

## అంచనాకొచ్చారు... ఆలోచన మార్చారు



- వేగంగా కదులుతున్న ఆప్షన్లు
- మాక్ కౌన్సెలింగ్ తర్వాత మారుతున్న సీన్
- సీటొచ్చే కాలేజీలపై కచ్చితంగా గురి
- ఒక్క రోజులోనే లక్షల్లో ఆప్షన్ల మార్పు
- 10న తొలి విడత సీట్ల కేటాయింపు

హైదరాబాద్

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో మాక్ సీట్ల కేటాయింపు తర్వాత వేగంగా ఆప్షన్లు మారుతున్నాయి. ఒక్క రోజులోనే 36 లక్షలకుపైగా ఆప్షన్లను విద్యార్థులు మార్చుకున్నారు. మార్పులు, చేర్పులకు మంగళవారం వరకూ గడువు ఉంది. ఇది ముగిసే నాటికి ఆప్షన్ల మార్పు మరో పది లక్షలు పెరిగే అవకాశం ఉంది. కొంతమంది విద్యార్థులు ఆప్షన్లు - మిగతా3లో

## ఆలయానికి కొత్తగా సీఈఓ



- చందా చోరీ ఉదంతంతో మసకబారిన అయోధ్య రామమందిర ప్రతిష్ఠను పునరుద్ధరించేందుకు చర్య
- ముగ్గురు సభ్యుల కమిటీకి సీఈఓ ఎంపిక బాధ్యతలు
- చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం
- తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియామకం
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీలో నిర్ణయాలు

## చర్చల యుద్ధానికి సిద్ధం

- కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- రాజ్యాంగ సవరణ బిల్లు
- వీగిపోవడంతో ఈసారి ముందస్తు వ్యూహంతో బరిలోకి బీజేపీ
- ప్రజాసమస్యలపై నిలదీసేందుకు సిద్ధమవుతున్న విపక్షాలు



## ఎట్టకేలకు ఆల్మట్టికి వరద



- 1,239 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిక
- సీజన్‌లో ఇదే తొలి ప్రవాహం
- నిరాశపరిచిన జూన్.. జూలై, ఆగస్టు పైనే ఆశలు
- ఎగువన భారీ వర్షాలు కురిస్తేనే శ్రీశైలం, సాగర్‌కు వరద

హైదరాబాద్:

కృష్ణా బేసిన్‌లో ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయానికి ఎట్టకేలకు వరద ప్రారంభమైంది. పశ్చిమ కనుమల్లో వర్షాలు కురవడంతో సోమవారం ఉదయం 6 గంటలకు జలాశయానికి 1,239 క్యూసెక్కుల వరద ప్రారంభమైంది. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉండడంతో జలాశయానికి ఆలస్యంగా వరద ప్రారంభమైంది. ఆల్మట్టి జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా, గతేడాది సరిగ్గా ఇదే సమయానికే నిల్వలు 92.17 టీఎంసీలకు చేరడంతో, గేట్లు ఎత్తి లక్ష - మిగతా3లో



## పక్కనే ఉన్న ఆంధ్రాను చూసి కర్ణాటక చాలా నేర్చుకోవాలి

- కేంద్రమంత్రి కుమారస్వామి
- కర్ణాటక సర్కార్‌పై కేంద్ర మంత్రి కుమారస్వామి విమర్శలు
- అభివృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను చూసి నేర్చుకోవాలని హితవు
- రాజకీయాలకు అతీతంగా ఏపీ నేతలు ఏకమవుతారని ప్రశంస
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ, అనకాపల్లి ప్రాజెక్టును ప్రస్తావించిన కుమారస్వామి
- కర్ణాటకలో మైనింగ్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వమే అడ్డంకి అని ఆరోపణ

## పర్యాటక ప్రాంతంగా
# దుర్గం చెరువు




- ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దాలి
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని, ట్రాఫిక్ మళ్లించి బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు
- అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి

హైదరాబాద్

హైదరాబాద్ కోర్ అర్బన్‌లో టూరిజం విస్తృతంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తారామతి, బారామతిని మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సీఎం తెలిపారు. మంజీరా, దిల్ కుషా గెస్ట్ హౌజ్‌లను ఆధునికీకరించాలని చెప్పారు. క్యూర్ పరిధిలోని అటవీ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్? సిటీలో అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని, దీని కోసం స్పెషల్ ఆఫీసర్‌ను - మిగతా3లో

# అంచనాకొచ్చారు... ఆలోచన మార్చారు

-మొదటిపేజీ తరువాయి

పెంచుతున్నారు. ఇంకొంతమంది తీసివేస్తున్నారు. ప్రధానంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, అనుబంధ ఎమర్జింగ్ బ్రాంచీల్లోనూ ఈ తేడా కన్పిస్తోంది. సివిల్, మెకానికల్, ఈఈఈ విద్యార్థుల్లో వేగం నిలకడగానే ఉంది. ఇవే బ్రాంచీలు కావాలని ఎంపిక చేసుకున్న విద్యార్థులు మార్పులకు ఇష్టపడటం లేదు. మెరుగైన కాలేజీ వైపే వాళ్లు చూస్తున్నారు. తొలి దశ కౌన్సెలింగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 89,785 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తంగా 55,14,891 ఆప్షన్లు అందాయి. సాంకేతిక విద్యామండలి ఈ నెల 4న మాక్ సీట్ల కేటాయింపు వెల్లడించింది. 175 కాలేజీల్లో 88,053 సీట్లు అందుబాటులో ఉంటే, 79,313 సీట్లను మాక్ ద్వారా కేటాయించారు. ఇంకా 8740 సీట్లు మిగిలిపోయాయి. అయితే ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులకే ఆప్షన్లు ఇచ్చారు. సీఎస్ఈ అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లో 62,509 సీట్లు ఉంటే, 58,052 సీట్లు భర్తీ అయ్యాయి. వీటిలో 4,457 సీట్లు మిగిలిపోయాయి. ఇప్పుడీ సీట్లు ఎక్కడ మిగిలిపోయే అవకాశం ఉందనే దానిపై ఇతర బ్రాంచీల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు దృష్టి పెట్టారు. తమకన్నా పెద్ద ర్యాంకు వచ్చినా మంచి కాలేజీలో సీటు కోల్పోయిన విద్యార్థులు కాలేజీలు, బ్రాంచీల ఆప్షన్లు మార్చుకుంటున్నారు. ఇదే క్రమంలో 50 వేలపైన ర్యాంకు వచ్చినా అవగాహన లేకుండా 5 వేల లోపు కటాఫ్ ఉన్న కాలేజీలకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఇష్టం లేని బ్రాంచీల్లో సాధారణ కాలేజీల్లో సీట్లు వచ్చాయి. మాక్ తర్వాత వాళ్లు కూడా వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ఆప్షన్లు మార్చుకుంటున్నారు.



### కాలేజీనా? బ్రాంచ్‌నా?

మాక్ సీట్ల కేటాయింపు తర్వాత విద్యార్థులు పలు అంశాలపై అధ్యయనం మొదలు పెట్టారు. నిపుణులు, అధ్యాపకులు, కౌన్సెలింగ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. వెబ్‌సైట్ ద్వారా శోధిస్తున్నారు. దీంతో మంచి కాలేజీలో సీటు వస్తే బ్రాంచీకి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఫలానా కాలేజీల్లో సీఎస్ఈ రాదని తెలిసినప్పటికీ, తర్వాత శ్రేణిలో ఈసీఈ లేదా సివిల్ బ్రాంచీలను ఎంచుకుంటున్నారు. ఇలా మారిన ఆప్షన్లు దాదాపు 3.2 లక్షల వరకూ ఉన్నాయి. ఈసీఈ బ్రాంచీ చేయాలనుకుని, ర్యాంకు ప్రకారం సరైన ఆప్షన్ ఇవ్వని విద్యార్థులు 1.2 లక్షల మంది వరకూ ఉన్నారు. ఇలాంటి వాళ్లంతా ఇప్పుడు బ్రాంచీ ప్రాధాన్యతగా ఆప్షన్లు మార్చుకుంటున్నారు. మొత్తం మీద ఈ నెల 10న వెల్లడయ్యే అసలు కౌన్సెలింగ్ సీట్ల కోసం భారీగా కసరత్తు చేస్తున్నారు.

# ఎవరిది నిజం... తెలంగాణ అప్పుల ఎంత



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల లెక్కలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం ముదిరింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపిస్తుంటే, మరోవైపు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. అసలు రాష్ట్ర అప్పులు రూ.1.86 లక్షల కోట్లా? లేక రూ.8.21 లక్షల కోట్లా? అనే గందరగోళం ప్రజల్లో నెలకొంది. ఇరు పార్టీలు సాక్ష్యాధారాలు, ఆర్బీఐ లెక్కలను తెరపైకి తెస్తూ తామే కరెక్ట్ అని వాదిస్తున్నాయి.మాజీ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆర్బీఐ గణాంకాలను, స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన ప్రకటనలను ఉటంకిస్తూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వాదన ప్రకారం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు భారీగా అప్పులు చేసింది. మంత్రి జూపల్లి కృష్ణారావు వాట్సాప్ లేఖ ప్రకారం ఈ అప్పు రూ.1,77,058 కోట్లు కాగా, 2026 జూన్ 30 నాటికి ఆర్బీఐ అధికారిక లెక్కల ప్రకారం అది రూ.1,86,067 కోట్లకు చేరింది. వివిధ మార్గాల ద్వారా ఈ ప్రభుత్వం మొత్తంగా రూ.4.5 లక్షల కోట్ల వరకు అప్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో నేరుగా తీసుకున్న రుణాలు, ప్రభుత్వ గ్యారెంటీతో పొందిన కార్పొరేషన్ రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని అసెంబ్లీ వేదికగా తాము నిరూపించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 2026 మార్చి 18న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రాష్ట్ర అప్పులు రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని, మరి ఇప్పుడు డిప్యూటీ సీఎం ఏకంగా రూ.8.21 లక్షల కోట్లు అని ఏ విధంగా చెప్తారని హరీశ్‌రావు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు సందర్భాన్ని బట్టి అబద్ధపు లెక్కలు మారుస్తున్నారని ఆయన విమర్శించారు.మరోవైపు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ఆరోపణలను పూర్తిగా తిప్పికొట్టారు. గత ప్రభుత్వం అబద్ధాల పునాదులపై నడిచిందని, సోషల్ మీడియా వేదికగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ బ్యాంకులు, సంస్థలు, కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన రుణాలు, చెల్లించాల్సిన బకాయిలు అన్నీ కలిపి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల భారీ భారాన్ని మోపిందని చెప్పారు. గత ప్రభుత్వం దాదాపు 10 శాతం వరకు అధిక వడ్డీకి అడ్డగోలుగా రుణాలు తెచ్చిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.34 వేల కోట్లుగా ఉన్న వార్షిక వడ్డీ భారాన్ని ప్రణాళికాబద్ధంగా రూ.11 వేల కోట్లకు తగ్గించామని, ఇప్పటికే రూ.2.08 లక్షల కోట్ల పాత అప్పుల బకాయిలను చెల్లించామని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలిస్తే, లెక్కల వైరుధ్యం ఎక్కడ వస్తోందో స్పష్టమవుతుంది. బీఆర్ఎస్ కేవలం బడ్జెట్ పరిధిలోని అప్పులు, ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను మాత్రమే ప్రామాణికంగా చూపిస్తోంది. అందుకే వారి లెక్క రూ.3.47 లక్షల కోట్ల నుంచి రూ.4.17 లక్షల కోట్ల మధ్య ఉంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బడ్జెటేతర రుణాలు, అంటే కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల కోసం వివిధ కార్పొరేషన్ల పేరిట తెచ్చిన అప్పులు, సివిల్ సప్లైస్ బకాయిలు, పవర్ డిస్కామ్‌ల నష్టాలు, ఇతర పెండింగ్ బిల్లులన్నింటినీ కలిపి సుమారు రూ.8.21 లక్షల కోట్లుగా లెక్కిస్తోంది. సాంకేతికంగా ఆర్బీఐ నిబంధనల ప్రకారం నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో ఉన్న అప్పుల విషయంలో బీఆర్ఎస్ చూపిస్తున్న రూ.1.86 లక్షల కోట్ల తాజా అప్పుల గణాంకాలు, గత అంచనాలు వాస్తవమే అయినప్పటికీ.. కార్పొరేషన్ల గ్యారెంటీల ద్వారా రాష్ట్రంపై పడిన పరోక్ష అప్పుల భారాన్ని పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ చెబుతున్న రూ.8.21 లక్షల కోట్ల సంఖ్య కూడా వాస్తవ ఆర్థిక భారాన్ని ప్రతిబింబిస్తోంది.

### 2014 జూన్ 2న రూ.72,658 కోట్ల అప్పు

మొదటగా, 2014 జూన్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పుడు, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన తెలంగాణ వాటాగా వచ్చిన ప్రారంభ అప్పు రూ.72,658 కోట్లు. అప్పట్లో తెలంగాణ మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రంగా పటిష్టమైన ఆర్థిక స్థితితో ప్రస్థానాన్ని ప్రారంభించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేళ్ల పాలన ముగిసి, డిసెంబర్ 2023లో వారు దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పులు ఊహించని స్థాయికి చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అధికారిక శ్వేతపత్రం ప్రకారం.. బడ్జెట్ రుణాలు, ప్రభుత్వ గ్యారెంటీలతో కార్పొరేషన్లు కాళేశ్వరం, పవర్ ఫైనాన్స్ వంటివి తెచ్చిన బడ్జెటేతర రుణాలు అన్నీ కలిపి మొత్తం అప్పు రూ.6,71,757 కోట్లకు చేరింది.ఇక గత రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత అప్పు చేసిందనే దానిపై ఇరు పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. మార్చి 2026 బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే 2026 నివేదిక ప్రకారం.. డిసెంబర్ 2025 నాటికి తెలంగాణ రాష్ట్రం , దాని అనుబంధ సంస్థల మొత్తం అప్పుల భారం రూ.8 లక్షల కోట్లకు చేరింది. అంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రం , దాని కార్పొరేషన్ల ద్వారా సుమారు రూ.3,19,179 కోట్ల కొత్త రుణాలను సేకరించారు.

### పాత అప్పులు తీర్చామంటున్న కాంగ్రెస్

ఇక్కడే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ముఖ్యమైన ఆర్థిక పద్దును తెరపైకి తెస్తోంది. తాము తెచ్చిన రూ.3.19 లక్షల కోట్ల రుణాలలో సింహభాగం సొమ్మును పాత అప్పులు తీర్చడానికే ఉపయోగించామని ప్రభుత్వం చెబుతోంది. గడిచిన రెండేళ్లలో పాత అప్పుల అసలు, వడ్డీల రూపంలో ఏకంగా రూ.3,04,202 కోట్లను తిరిగి చెల్లించినట్లు అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గతంలో తెచ్చిన రూ.44,000 కోట్ల రుణాల క్లియరెన్స్ కూడా ఉంది.తెలంగాణ రాష్ట్రంపై నేడు ఉన్న సర్వసమ్మతమైన, అధికారికమైన మొత్తం అప్పుల భారం రూ.8 లక్షల కోట్లు. రాజకీయ నేతలు కేవలం పబ్లిక్ డెట్ ప్రస్తుతం సుమారు రూ.5.03 లక్షల కోట్లు మాత్రమే చూపిస్తున్నారు. కానీ కార్పొరేషన్ల గ్యారెంటీ అప్పులను కూడా కలిపితేనే అసలైన రూ.8 లక్షల కోట్ల నిజం బయటపడుతుంది. గత ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల కోసం అప్పులు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ఆ పాత అప్పుల రీస్ట్రక్చరింగ్ , వడ్డీలు కట్టడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తోందని, ఈ చక్రబంధం నుండి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ తేరుకోవడానికి మరికొన్నేళ్లు పడుతుందని భావిస్తున్నారు.ఎవరు కరెక్ట్ అన్నది వారు ఏ అప్పులను ప్రామాణికంగా తీసుకుంటున్నారనే దానిపైనే ఆధారపడి ఉంది. ఏదేమైనా, ఈ లెక్కల లడాయి తేలాలంటే ఇరుపక్షాలు సవాళ్లకు పరిమితం కాకుండా, ఒకే వేదికపై శ్వేతపత్రాలతో బహిరంగ చర్చకు రావలసి ఉంది.

## రకింగ్ కొత్త వ్యాయమం

**హైదరాబాద్ :** ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ వాకింగ్ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఇటీవల ఫిట్‌నెస్ ప్రపంచంలో 'రకింగ్ ' అనే కొత్త వ్యాయామ విధానం ట్రెండ్ అవుతోంది. సైనికులు ఎన్నో ఏళ్లుగా అనుసరిస్తున్న ఈ పద్ధతి ఇప్పుడు సాధారణ ప్రజల్లోనూ ప్రాచుర్యం పొందుతోంది. ఈ పద్ధతి పాటించడం వల్ల సాధారణ వాకింగ్ కంటే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. అసలేంటీ రకింగ్? దీనిని ఎలా చేయాలి?రకింగ్ అనేది వీపుపై బరువున్న బ్యాక్‌ప్యాక్ ధరించి నడిచే వ్యాయామం. ఇందులో శరీర సామర్థ్యానికి తగ్గట్టుగా బ్యాగ్‌లో బరువు పెట్టుకుని నిర్ణీత దూరం లేదా సమయం పాటు నడుస్తారు. ఇది కార్డియో వ్యాయామంతో పాటు కండరాలపై కూడా ప్రభావం చూపే ఫుల్ బాడీ వర్కౌట్‌గా పరిగణిస్తారు. సాధారణ వాకింగ్‌లో శరీర బరువును మాత్రమే మోస్తూ నడుస్తాం. కానీ రకింగ్‌లో అదనపు బరువును మోయాల్సి ఉండటంతో కాళ్లు, నడుము, వీపు, భుజాలు, పొత్తికడుపు కండరాలు మరింతగా పనిచేస్తాయి. దీనివల్ల శరీరం ఎక్కువ శక్తిని వినియోగించి ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేస్తుంది. అందుకే తక్కువ సమయంలోనే మంచి ఫిట్‌నెస్ ఫలితాలు కనిపించే అవకాశం ఉంటుంది.రకింగ్ వల్ల గుండె వేగం క్రమంగా పెరిగి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

## పర్యాటక ప్రాంతంగా దుర్గం చెరువు

-మొదటిపేజీ తరువాయి

నియమించాలని చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### ట్రాఫిక్ మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలి

హైదారాబాద్? నగరంలో పురానాపూల్ వంటి వారసత్వ సంపదగా నిలిచిన బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి చేసిన తర్వాత అవసరమైతే ట్రాఫిక్‌ను మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు.

### ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలి

డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌కు ఏర్పాట్లు ప్రారంభించాలన్న సీఎం వివిధ శాఖ మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. వికారాబాద్‌లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్న సీఎం యాదాద్రి తరహాలో ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె.రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్?, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్?తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ధరణి అక్రమాలపై సీఐడీ!

-మొదటిపేజీ తరువాయి

సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇప్పటికే ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉండగా, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారులతో నియమించిన ప్రత్యేక కమిటీ నివేదిక 15 రోజుల్లో ప్రభుత్వానికి అందనుంది. ఈ రెండు నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించిన అనంతరం సీఐడీ లేదా సిట్ దర్యాప్తునకు ఆదేశించే అవకాశమున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. ధరణి పోర్టల్ వేదికగా వేల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఈ అక్రమ లావాదేవీల వెనుక అప్పటి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులున్నారని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ఆరోపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో భూములు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేశారని ఆ పార్టీ నేతలు ఆది నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పైలట్ ప్రాతిపదికన సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో జరిగిన భూలావాదేవీలపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించింది. కేరళకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ కేరళ సెక్యూరిటీ ఆడిట్ అండ్ అష్యూరెన్స్ సెంటర్ (కేఎస్ఏఏసీ) ఆడిటింగ్ జరిపింది. ఈ రెండు జిల్లాలతో పాటు రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో జరిగిన భూలావాదేవీలపైనా ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహించారు.

2020 అక్టోబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు జరిగిన మొత్తం 8 లక్షల లావాదేవీలను పరిశీలించగా దాదాపు 22 వేల అనుమానాస్పద లావాదేవీలు నమోదైనట్టు గుర్తించారు. కింది స్థాయి అధికారుల నివేదికలు, ఉత్తర ప్రత్యుత్తరాలతో సంబంధం లేకుండా నేరుగా భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంతో పాటు అంతకంటే ఉన్నత స్థాయిలో ఉండే అధికారుల లాగిన్‌ల ద్వారా ఈ అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని వెల్లడయ్యింది. సీసీఎల్ఏలోని కొందరు సిబ్బంది, అధికారుల ప్రమేయంతోనే మెజార్టీ లావాదేవీలు జరిగాయని, కొన్నిసార్లు తెల్లవారుజాము సమయాల్లో కూడా ధరణి పోర్టల్‌లోకి అధికారిక లాగిన్ ద్వారా వెళ్లి భూ హక్కులు రికార్డులు మార్చారని తేలింది. ముఖ్యంగా అసైన్డ్ భూముల విషయంలో ఎక్కువ అక్రమాలు జరిగాయని, మొత్తం 10 వేలకు పైగా ఎకరాల్లో ఈ లావాదేవీలు జరిగాయని బహిర్గతమయ్యింది. అయితే ఇందుకు ఎవరు బాధ్యులన్నది మాత్రం ఫోరెన్సిక్ ఆడిట్‌లో స్పష్టంగా వెల్లడి కాలేదు.

### బాధ్యుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ

ఈ క్రమంలో అక్రమ లావాదేవీలకు బాధ్యులెవరన్నది గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. సీసీఎల్ఏ, సైబర్‌క్రైమ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల అధికారులతో పాటు కొన్ని జిల్లాల కలెక్టర్లు కూడా కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ ఆయా లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధ్యులెవరన్నది తేల్చనుంది. అక్రమ లావాదేవీల బాధ్యులను గుర్తించడంతో పాటు భవిష్యత్తులో భూభారతి పోర్టల్‌లో ఇలాంటి తతంగాలు జరగకుండా ఏం చేయాలన్న దానిపై ఈ ప్రత్యేక కమిటీ నివేదిక ఇవ్వనుంది. 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించగా.. ప్రస్తుతం ఈ కమిటీ అన్ని రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తోంది. ఈ పరిశీలన అనంతరం ప్రభుత్వానికి ఇచ్చే నివేదికతో పాటు ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

## ఎట్టకేలకు ఆల్మట్టికి వరద



-మొదటిపేజీ తరువాయి

క్యూసెక్కుల నీటిని దిగువన విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 21.18 టీఎంసీలే నిల్వలే ఉన్నాయి. కృష్ణమ్మ జన్మస్థానమైన మహాబలేశ్వర్(మహారాష్ట్ర)లోని పశ్చిమ కనుమల నుంచి ఆల్మట్టి ప్రాజెక్టు వరకు మధ్యలో ఉన్న 518 కి.మీ.ల పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిస్తేనే ఆల్మట్టి జలాశయం నిండుతుంది. వర్షాలు లేక ఇప్పటికే జూన్ తీవ్ర నిరాశ కల్పించగా, జూలై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలు కురిస్తే ఎగువన కర్ణాటకలోకి ఆల్మట్టితోపాటు నారాయణపూర్, తుంగభద్ర జలాశయాలు నిండి దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి వరద వస్తుంది.

### ఆయా జలాశయాల్లో ఇలా...

ఆల్మట్టికి దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు గతేడాది 99 వేల క్యూసెక్కుల వరద రాగా, ప్రస్తుతం కేవలం 19 క్యూసెక్కుల నీరే వచ్చింది. జలాశయ గరిష్ట సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 23.78 టీఎంసీలకు నిల్వలు పడిపోయాయి. కృష్ణా ప్రధాన పాయపై ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండాలంటే 120 టీఎంసీలకు పైగా వరద రావాలి.

కృష్ణా ఉపనది భీమాపై మహారాష్ట్రలో ఉన్న ఉజ్జయినీ జలాశయానికి గతేడాది ఇదే సమయానికి 72వేల క్యూసెక్కుల వరద రాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు చుక్కనీరు రాలేదు. జలాశయ నిల్వ సామర్థ్యం 123.29 టీఎంసీలు కాగా 49.07 టీఎంసీల నిల్వలున్నాయి. కృష్ణా మరో ఉపనది తుంగభద్రపై కర్ణాటకలో ఉన్న తుంగభద్ర జలాశయానికి గతేడాది ఈ సమయానికి 72వేల క్యూసెక్కుల వరద రాగా, ప్రస్తుతం 1,550 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయ గరిష్ట సామర్థ్యం 105.78 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.38 టీఎంసీలే నిల్వ ఉన్నాయి. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు గతేడాది 1.17లక్షల క్యూసెక్కుల ప్రవాహం రాగా, ప్రస్తుతం ఎలాంటి వరద రావడం లేదు. జూరాల గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, 5.85 టీఎంసీల నిల్వలున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు 4.13 టీఎంసీల వరద వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయ గరిష్ట నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 802 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉంది. నిల్వలు 42.21 టీఎంసీలకు తగ్గిపోగా, ప్రస్తుత సీజన్‌లో జలాశయంలోకి 5.6 టీఎంసీల వరద వచ్చి చేరింది. నాగార్జునసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, 5,224 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 138.39 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ విద్యుదుత్పత్తి ద్వారా 4,168 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సంపాదకీయం

# ముప్పేట దాడిలో పాకిస్తాన్

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం ఇప్పుడు కొత్త రూపం తీసుకుంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) పాకిస్తాన్ భద్రతా దళాలను మాత్రమే కాకుండా, చైనా ప్రయోజనాలను కూడా నేరుగా లక్ష్యంగా చేసుకుంటోంది. ఇటీవలి దాడులు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. చైనా?పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుల భద్రతపై ఇది తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. గ్వాదర్ పోర్టు సమీపంలోని జివానీ ప్రాంతంలో జరిగిన ఇటీవలి ఘటనలో బీఎల్‌ఏ పాకిస్తాన్ సైన్యానికి చెందిన రాడార్ స్టేషన్, ఎయిర్ స్టేషన్ ఔట్‌పోస్టుపై దాడి చేసింది. ఈ ప్రాంతానికి సమీపంలో చైనాకు సంబంధించిన స్థావరం ఉండటం వల్ల ఈ దాడి చైనాపై కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గ్వాదర్ పోర్టుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ దాడి, హార్ముజ్ జలసంధికి సమీపంలో ఉండటం వల్ల వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. బీఎల్‌ఏ మందుగుండు వాహనంతో ఆత్మాహుతి దాడి చేసినట్లు సమాచారం. దీంతో పాకిస్తాన్ భద్రతా దళాల్లో భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు బీఎల్‌ఏ నాలుగైదు ప్రధాన వంతెనలను పేల్చివేసి, ఇప్పుడు తీర భద్రతా దళాలపై కూడా దాడులు చేస్తోంది. బీఎల్‌ఏ తన స్వంత నేవీ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటనలు వచ్చాయి. గతంలో కోస్ట్ గార్డ్ సిబ్బందిపై దాడులు జరిపి, ముగ్గురిని చంపినట్లు బీఎల్‌ఏ పేర్కొంది.చైనా ఇప్పటికే పాకిస్తాన్ భద్రతా ఏర్పాట్లపై నమ్మకం కోల్పోయి, తన స్వంత రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు చైనా పెట్టుబడుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా?పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో కీలక భాగం. గ్వాదర్ పోర్టు ద్వారా చైనాకు అరేబియన్ సముద్రంలో ప్రత్యక్ష ప్రవేశం లభిస్తుంది. ఈ ప్రాంతంలో దాడులు పెరగడం వల్ల ప్రాజెక్టుల అమలు ఆలస్యం కావడం, ఖర్చులు పెరగడం, పెట్టుబడిదారుల నమ్మకం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. బీఎల్‌ఏ దాడులు ఇప్పుడు చైనా నియంత్రణలో ఉన్నట్లు భావించే ప్రాంతాల్లోకి విస్తరించాయి. ఇది చైనా ప్రణాళికలను భంగపరచడమే కాకుండా, పాకిస్తాన్‌తో చైనా సంబంధాలను కూడా పరీక్షిస్తోంది. చైనా ఇప్పటికే ఉలిక్కిపడి, భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసుకుంటోంది.బీఎల్‌ఏ దాడులు ఇప్పుడు మరింత సంఘటితంగా, వ్యూహాత్మకంగా మారాయి. గ్వాదర్ పోర్టును తదుపరి టార్గెట్‌గా ఎంచుకోవచ్చని చర్చలు జరుగుతున్నాయి. బీఎల్‌ఏ తన దాడుల వీడియోలు, సాక్షాలతో సహా విడుదల చేస్తోంది. దీని వల్ల ప్రచారం విస్తృతంగా వ్యాపిస్తోంది. అయితే పాకిస్తాన్ అధికారులు ఈ ఘటనల గురించి బహిరంగంగా మాట్లాడడం లేదు. పత్రికల్లో కూడా విస్తృతంగా కవరేజ్ రావడం లేదు. ఇది ప్రభుత్వం దాడుల పరిమాణాన్ని తక్కువ చేయడానికి లేదా చైనా పెట్టుబడులపై నమ్మకం కల్పించడానికి చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, బీఎల్‌ఏ ప్రచారం వల్ల వాస్తవాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్నాయి.ఈ దాడుల నేపథ్యంలో అమెరికా బలూచ్ ఉద్యమానికి మద్దతు ఇస్తోందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది చైనా ప్రభావాన్ని అడ్డుకోవడానికి భాగంగా ఉండవచ్చని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవి ఇప్పటికి అనుమానాలే. చైనా బలూచిస్తాన్ నుంచి వెళ్లిపోవాలనే ఉద్దేశంతో బీఎల్‌ఏ ఈ దాడులు చేస్తోందని కూడా భావన ఉంది. గ్వాదర్ పోర్టు, సమీప ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు కొనసాగితే, చైనా తన ప్రాజెక్టులను పునఃసమీక్షించవచ్చు లేదా భద్రతా ఖర్చులను బాగా పెంచవచ్చు.బలూచిస్తాన్ సమస్య ఇప్పుడు స్థానిక స్థాయిని దాటి ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను కలిగిస్తోంది. చైనా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, భద్రతా సవాళ్లు రెండు దేశాలను కూడా ఒత్తిడిలోకి తెస్తున్నాయి.జైష్ ఎ మహ్మద్‌కు కేటాయించిన భూమి సుమారు 5 ఎకరాలు. ఒక ఎకరం సుమారు 4,800 గజాలకు సమానం కాబట్టి మొత్తం స్థలం 24,000 గజాలు అవుతుంది. సాధారణంగా ఒక వ్యక్తిని సమాధి చేయడానికి 6 గజాలు సరిపోతాయని పరిగణిస్తే, ఈ భూమిలో సుమారు 4 వేల మంది వరకు సమాధి చేయవచ్చు. ఇంత పెద్ద ప్రాంతాన్ని కేటాయించడం సాధారణం కాదు. ఇది భవిష్యత్తులో ఎక్కువ సంఖ్యలో మరణాలను ఊహించి లేదా ఇప్పటికే జరిగిన పెద్ద నష్టాలను సూచిస్తోంది.ఈ సమాధి స్థలాలు ఆపరేషన్ సిందూర్ అనే సైనిక చర్యతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం లష్కర్ ఎ తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్, జైష్ ఎ మహ్మద్‌తోపాటు మరో రెండు ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 11 స్థావరాలపై దాడి చేసింది. బ్రహ్మోస్ క్షిపణులు ఉపయోగించి ఈ దాడులు నిర్వహించారు. నివేదికల ప్రకారం వందల మంది ఉగ్రవాదులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఉమర్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే బతికి ఉన్నట్లు సమాచారం.ఈ వైరల్ ఫొటోలు, స్థల కేటాయింపులను పరిశీలిస్తే ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద సంస్థలపై ఎంత బలమైన దెబ్బ తగిలించిందో అర్థమవుతుంది. ఒక్క జైష్ ఎ మహ్మద్‌కే 5 ఎకరాలు కేటాయించడం, మిగతా సంస్థలకు ప్రత్యేక స్థలాలు ఇవ్వడం. ఇవి అన్నీ ఒకేసారి జరిగిన పెద్ద మరణాలను సూచిస్తున్నాయి. 4 వేల మంది వరకు సమాధి చేయగల స్థలం కేటాయించడం అంటే ఆ సంస్థలు తమ సభ్యులను కోల్పోయిన స్థాయి చాలా ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. బ్రహ్మోస్ వంటి అధునాతన క్షిపణులతో ఏకకాలంలో బహుళ స్థావరాలపై దాడి చేయడం భారత సైన్యం యొక్క ఖచ్చితత్వం, సామర్థ్యం, ఉగ్రవాద వ్యతిరేక నిబద్ధతను చూపిస్తోంది. ఒక్క ఉమర్ మాత్రమే బతికి ఉండటం మిగతా వారందరూ ఆ దాడిలో చనిపోయినట్లు స్పష్టం చేస్తోంది. ఇది పాకిస్తాన్ భూభాగం నుంచి నడిచే ఉగ్రవాద కార్యకలాపాలకు తీవ్రమైన ఎదురుదెబ్బగా మారింది.అవి ఆపరేషన్ సిందూర్ విజయం, ఉగ్రవాద సంస్థలకు కలిగిన భారీ నష్టానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇలాంటి చర్యలు సరిహద్దు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో భారత్ తీసుకుంటున్న చర్యల ప్రభావాన్ని మరింత స్పష్టంగా చూపుతాయి.బీఎల్‌ఏ దాడులు ఇలాగే కొనసాగితే, సీపీఈసీ ప్రాజెక్టుల వేగం మందగించడం, ప్రాంతీయ అస్థిరత పెరగడం తప్పదు. ఈ పరిస్థితి బలూచిస్తాన్‌లోని స్థానిక గుర్తింపు, వనరుల పంపిణీ సమస్యలను పరిష్కరించకపోతే, మరింత తీవ్రమవుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# తామరపువ్వు ఎడారిల పూస్తదా?

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణలో మూడు రోజులు పర్యటించిన తర్వాత ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, గతంలో వేర్వేరు పదవుల్లో ఉండిన వాడూ అయిన ఒకరిని ఈ విషయమై అడిగినప్పుడు, ఆయన చేసిన వ్యాఖ్య ఈ విధంగా ఉన్నది. తామర పువ్వు ఎడారిల పూస్తదా?. ఆయన ఇంకా ఓ మాట కూడా అన్నాడు. మావోళ్లు ఏవో కలలు కంటుంటరు. అన్నీ పగటి కలలు. అందుకు తగ్గట్టు ఇక్కడ జరిగేది లేదు పెట్టేది లేదు, అని వ్యాఖ్యానించాడు. గతంలో జరిగిందేమిటి, జరగనిది ఏమిటి, రాగల రోజుల్లో ఏమి జరగవచ్చు, ఏమి జరగకపోవచ్చుననే మాటలు కూడా కొంత సేపు సాగాయి. అవన్నీ ఇక్కడ పేర్కొనటంలేదు. ఆయన చెప్పిన వాటి సారాంశం మాత్రం, ఒకప్పటి జనసంఘ్ కాలంలో గాని, తర్వాత వాజపేయి పాలించినప్పుడు గాని, ఇప్పుడు పన్నెండేండ్లుగా మోదీ హయాంలో గాని, ఈ ప్రాంతంలో తమ పార్టీ ఒక స్థాయికి మించి ఎప్పుడూ పైకి పోలేదు. ప్రస్తుత పరిస్థితులను చూసినా, పార్టీ పనితీరును చూసినా, భవిష్యత్తు మీద ఆశలేమీ కలగటంలేదు. రాగల కాలంలో అద్భుతాలేమన్నా జరిగితే తప్ప. చర్చలోకి వెళ్లేముందు పార్టీ అధ్యక్షుని పర్యటన వివరాలను చూద్దాము. ఆయన జూన్ 28 నుంచి మూడు రోజులపాటు తెలంగాణలో ఉన్నారు. లోగడ ఎవరు వచ్చినా ఒకటి రెండు రోజులకు మించి గడపలేదని వార్తలు చెప్పాయి. బిహార్‌కు చెందిన తనకు తెలంగాణతో ప్రత్యక్ష పరిచయం లేనందున, జాతీయ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన దరిమిలా అటువంటి పరిచయం కోసం ప్రయత్నించటం మంచిదే. ఆయన మూడు రోజులలో పలు కార్యక్రమాలలో పాల్గొని, నాయకుల నుంచి కార్యకర్తల వరకు, బీజేపీ మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యుల వరకు అందరినీ కలిశారు. పరిస్థితులు తెలుసుకొని, ఇవ్వవలసిన ఆదేశాలు ఇచ్చి, చేయవలసిన హెచ్చరికలు కూడా చేశారు. పార్టీ తక్షణ లక్ష్యం హైదరాబాద్ మహానగరంలోని మూడు కార్పొరేషన్లలో గెలువటం, తదుపరి లక్ష్యం 2028 అసెంబ్లీ ఎన్నికలు గెలిచి రాష్ట్రం లో అధికారానికి రావటమని దిశానిర్దేశం చేశా రు. ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి, హోంమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఎప్పుడు వచ్చివెళ్లినా, పార్టీలో కొత్త జోష్ వచ్చింది అని ప్రకటించటం ప్రతిసారీ ఆనవాయితీగా జరిగేదే గనుక ఈ సారి కూడా అవే మాటలు వినిపించాయి. అంతవరకు అంతా బాగున్నది. ఇప్పుడు బీజేపీ అధ్యక్షుని పర్యటన జరిగిన సమయంలో గల మూడు విధాలైన పరిస్థితులను ఒకసారి చూడాలి. మొదటిది, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వారు పశ్చిమ బెంగాల్‌లో సాధించిన ఘన విజయం. రెండు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో కూడా పరీక్ష పత్రాలు వరుసగా లీకవుతుండటం, అతి ప్రతిష్ఠాత్మకమైన అయోధ్య రామమందిరంలో, మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో భారీ అవినీతి, కుంభకోణాలు బయటపడటం. మూడు సర్ పేరిట జరుగుతున్న ఓటర్ జాబితా సవరణలపై అనుమానాల గందరగోళం ఇంకా కొనసాగటం. ఇవి చాలవన్నట్టు అకస్మాత్తుగా,భారతీయుల పౌరసత్వానికి ఏది గుర్తింపన్న ప్రశ్న తలెత్తి కోట్లాది మంది, ఇంకా చెప్పాలంటే మొత్తం దేశ ప్రజలందరి గుర్తింపును ప్రశ్నార్థకంగా మార్చటం. ఇవి జాతీయ స్థాయి విషయాలే అయినా తెలంగాణ ప్రజలు ఆసక్తితో గమనించినవి, లేదా ఆందోళనకు గురైనటువంటివి. పరీక్ష పత్రాల లీకేజీ వల్ల నష్టపోయిన యువతీ యువకులు తెలంగాణలోనూ భారీ సంఖ్యలో ఉన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమం జూన్‌లో హైదరాబాద్‌లో జరిగినప్పుడు వారు చాలామంది పాల్గొన్నారు. వారి సోషల్ మీడియా పోస్టింగులు హోరెత్తాయి. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పట్టుదలగా సాగుతున్న నిరసనను, ఈ అంశం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలంగాణ యువత కూడా గమనిస్తున్నది. నీట్ పేపర్ లీకేజీ చాలదన్నట్టు, ఒకవైపు కాక్రోచ్ నిరసనలు జరుగుతుండగానే, ఆ నిరసనలు జరిగిన మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో మరిన్ని పేపర్లు లీకయి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఆ రెండు చోట్ల పాలిస్తున్నది డబుల్ ఇంజిన్ సర్కార్లే. బెంగాల్ ఘన విజయం గురించి నితిన్ నబీన్ ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించారు. పార్టీ శ్రేణులను ఉత్సాహపరచటం ఆయన ఉద్దేశం. కానీ, సర్ మూలంగా ఆ గెలుపు తక్కిన దేశంలో వలె తెలంగాణ ప్రజల దృష్టిలోనూ అనుమానాస్పదంగా మారిన విషయం హైదరాబాద్ పర్యటనలో తన దృష్టికి వచ్చిందో లేదో తెలియదు. నేపథ్య పరిస్థితి ఇట్లుండగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఆ పర్యటన మరుసటి రోజున మాట్లాడుతూ, తాము బెంగాల్ కన్నా పక్కా ప్రణాళికతో వస్తున్నామనటం గమనించదగ్గది. సరిగా అవే రోజులలో తెలంగాణలో మొదలైన సర్ కార్యక్రమం ఎంత అస్తవ్యస్తంగా సాగుతున్నదో ఇదీ అదీ అని గాక అన్ని పత్రికలు ప్రతిరోజూ రాస్తున్నాయి. ఇతర రాష్ట్రాల అనుభవాలు, అంతకన్నా పక్కా ప్రణాళిక అనే ప్రకటనలు, మరొకవైపు క్షేత్రస్థాయిలో తెలంగాణ ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్న గందరగోళాన్ని బట్టి కలిగే అభిప్రాయం ఏమిటి? మోదీ ప్రభుత్వం గురించి, బీజేపీ గురించి, ఎన్నికల సంఘం గురించి? అనగా, 2028 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో తమ ఓటు హక్కుపై, ఆ జాబితా ప్రాతిపదికగా జరగగల ఎన్నికల ఫలితాలపై తెలంగాణ ప్రజలకు రెండేండ్ల ముందు నుంచే అనుమానాలు ఏర్పడాలన్నమాట. బెంగాల్ ఉదంతం నిరంతరం భయపెడుతుండాలన్నమాట. నితిన్ నబీన్ పర్యటనకు కొన్ని రోజుల ముందు బయటపడిన అవినీతి కుంభకోణాలు మొత్తం దేశంతో పాటు తెలంగాణను ఆశ్చర్యపరచాయి. ప్రశ్నపత్రాల లీక్ వలె రామమందిరం ట్రస్ట్ అవినీతి, మధ్యప్రదేశ్ భూకుంభకోణం రెండూ కూడా డబుల్ ఇంజిన్ సర్కార్‌ల గొడుగు నీడలో జరిగినవే. మధ్యప్రదేశ్‌లోనైతే సాక్షాత్తు ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్‌పై బలమైన ఆధారాలు బయటకు వచ్చాయి. అయినా తను స్వయంగా పదవి నుంచి వైదొలగకపోవటమే గాక, జాతీయ నాయకత్వం కూడా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. నరేంద్రమోదీ 2014 ఎన్నికల ప్రచారంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వపు అవినీతి కుంభకోణాలపై తీవ్రస్థాయి విమర్శలు చేశారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా అవినీతిని పూర్తిగా అదుపు చేశానని, ప్రధానిగా అవకాశమిస్తే దేశమంతటా అదే పని చేస్తానని పదేపదే నమ్మబలికారు. ప్రజలు ఆ మాట గట్టిగానే నమ్మారు. కానీ అవినీతికి సంబంధించి ప్రపంచంలో ఇండియా ర్యాంక్ 2014లో 175 దేశాల్లో 85 కాగా, 2025లో 182 దేశాల్లో 91కి పడిపోయింది. ఇతరత్రా అవినీతిని ఏమి అరికట్టారో గాని అది తగ్గినట్టు ప్రజలకైతే ఏమీ అనిపించటంలేదు. పెద్దపెద్ద పారిశ్రామికవేత్త లకు, వ్యాపార దిగ్గజాలకు తెలివైన రీతిలో దోపిడీ అవకాశాలు కల్పిస్తున్నట్టు పలువురు నిపుణులు ఎత్తి చూపుతున్నారు. అవినీతిపరులపై నిఘా ఏజెన్సీల దాడులు, కేసులు, వారు బీజేపీలో చేరగానే ఆ ఫైళ్లు మాయం కావటం బీజేపీ వాషింగ్ మెషీన్ పేరిట ప్రసిద్ధికెక్కటం తెలిసిందే.

తమ తిరుగులేని అధికారం గురించి బీజేపీ నేతలు సగర్వంగా చాటుకుంటుంటారు. కానీ అధికారంతోపాటు అవినీతి విస్తరిస్తున్నది. ఇటువంటి వారిని దృష్టిలో ఉంచుకొనే కావచ్చు బ్రిటిష్ ఎంపీ లార్డ్ ఆక్టన్ 1887లోనే, అధికారంతో అవినీతి అబ్బుతుంది, సంపూర్ణ అధికారంతో అవినీతి సంపూర్ణమవుతుంది అన్నాడు. ఇటువంటి డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తెలంగాణలో ఆవిష్కరిస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ ప్రజలకు హామీ ఇస్తున్నారు. నిజానికి తెలంగాణ బీజేపీ నేతలపై వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు, ఇక్కడ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వారి మిత్రపక్షంగా, అవినీతి ఆరోపణలు బాగానే వినిపించేవి. ఆ పార్టీకి ఇక్కడ విలువ లేకపోవటానికి అది కూడా ఒక కారణం.

నితిన్ నబీన్ ఇక్కడ బహిరంగ కార్యక్రమంలో ఏమి మాట్లాడినా, పార్టీ బాధ్యుల నిష్క్రియాపరత, క్షేత్రస్థాయికి వెళ్లకుండా ప్రజలను కలువకుండా ప్రెస్‌మీట్లకు పరిమితం కావటం గురించి అంతర్గత సమావేశాల్లో ఆక్షేపించినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇవి నిజమని భావించేందుకు తగు కారణాలున్నాయి. 2025 ఎన్నికల ముందుకాలంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తరచు హైదరాబాద్ వస్తూ, లేదా ఇక్కడి నాయకులను ఢిల్లీకి పిలిపించుకొంటూ పార్టీ కార్యకలాపాల గురించి చర్చించేవారు. ఆయనతో సమావేశం అంటేనే తెలంగాణ నాయకులు భయపడుతుండేవారు. అందుకు కారణం ఎల్లప్పుడూ ఒకటే. ఈ నాయకులు అప్పుడు కూడా పని చేసేవారు కాదు. హైదరాబాద్‌లో కూర్చొని కాలక్షేపాలు సాగుతుండేవి. గ్రూపు రాజకీయాలు అందుకు అదనం. అధికారం ఇప్పుడు మరింత పెరుగుతున్నందున లార్డ్ ఆక్టన్ సూత్రీకరణను మరింత నిజం చేస్తున్నారనే మాట వినవస్తుంటుంది. ఒక నిర్మాణం శిథిలావస్థ కన్నాముందు దశకు చేరినాకొద్దీ బలహీనతలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతుంటాయి. విచిత్రమైన రీతిలో సరిగా ఎప్పుడైతే చొరబాటుదారులనే వారిని సరిహద్దుల మీదుగా అవతలికి తోసివేసే కార్యక్రమం మొదలైందో, అందుకు పలువురు చప్పట్లు చరిచి అభినందిస్తున్నారో, సరిగ్గా అదే సమయంలో అసలు భారతీయ పౌరసత్వానికి గుర్తింపు ఏది అనే ప్రశ్న పిడుగుపాటు వలె వచ్చి పడింది. ఓటర్ కార్డు కాదు, ఆధార్ కాదు, పాస్‌పోర్ట్ కాదు, బర్త్ సర్టిఫికెట్ కాదు, ఇంటి నంబర్ కాదు. వీటిలో కొన్ని, లేదా అన్నీ చొరబాటుదారులు కూడా సంపాదించగలరు. మరి ఏది పౌరసత్వం? ఓ మహాత్మా, ఓ మహర్షీ! ఈ దేశం స్వతంత్రమైన నిండు 79 ఏండ్ల తర్వాత ఇదీ పరిస్థితి. ఇది మొదటిసారి ప్రశ్నగా మారింది మోదీ ప్రభుత్వంలో. నితిన్ నబీన్ మహాశయుడు తెలంగాణ ఎడారిలో తామర పువ్వును పూయించగలమని చేస్తున్న భీకరమైన ప్రతిజ్ఞ, మొదట ప్రస్తావించిన సీనియర్ నాయకునికి కేవలం ఒక పగటి కలగా తోచటం ఎందువల్లనో బహుశా ఇంకా వివరించనక్కరలేదు. వారు తమకు మొదటి నుంచి కొరుకుడుపడని దక్షిణాదికి తెలంగాణను ముఖద్వారం చేసుకుంటామని 2014లో ప్రకటించి 12 ఏండ్లు గడిచాయి. ఈ సారి కొత్త ఆశగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను కలుపుకొని, రేవంత్‌రెడ్డిని రిజర్వ్‌లో ఉంచుకొని ఇప్పుడు కొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా తమ నాయకుల ఆశలు కనిపించటంలేదు.

# అప్పులపై అబద్ధాలు.. కాళేశ్వరంపై కుట్రలు

కాళేశ్వరం ప్రాజెక్టు మీద, తెలంగాణ అప్పుల మీద కాంగ్రెస్ చేసిన, చేస్తున్న దుష్ప్రచారం అంతాఇంత కాదు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు గుప్పించి గోబెల్స్‌ను మించి అబద్ధాలను వల్లెవేశారు. అదే నిజమని కొందరు ప్రజలు ఆశపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిపాలన చేయాల్సిందిపోయి మళ్లీ అదే పనిగా బీఆర్‌ఎస్‌పై, కేసీఆర్ హయాంలో జరిగిన అప్పులపై అబద్ధాలు చెప్పడం మొదలుపెట్టారు. రెండున్నరేండ్ల పాలనలో విఫలమై తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొన్నందుకు మళ్లీ అదే పాత సూత్రాన్ని కాంగ్రెస్ నేతలు అందుకుంటున్నారు. తెలంగాణలో టీఆర్‌ఎస్ 2014లో ప్రభుత్వం ఏర్పాటుకు ముందు సమైక్య రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ. 84,268 కోట్లు. ఇది రాష్ట్ర విభజన సందర్భంగా వారసత్వంగా వచ్చిన అప్పు. 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు కాంగ్రెస్ పాలనలో ఎఫ్‌ఆర్‌బీఎం ద్వారా రూ. 15,118 కోట్లు తీసుకుని దానిని బీఆర్‌ఎస్ ప్రభుత్వ లెక్కలో వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రూ. 5,16,881 కోట్లు. సమైక్య రాష్ట్రంలో నుంచి వచ్చిన అప్పు, కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై నెట్టిన అప్పు తీసేస్తే మొత్తం బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో చేసిన అప్పు రూ. 4,17,495 కోట్లు. ఈ విషయాన్ని ఒకటికి పదిసార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో, బహిరంగ సభలు, అనేక సమావేశాలు, ప్రెస్‌మీట్‌ల ద్వారా ఆధారాలతో నిరూపించారు. తెలంగాణ బడ్జెట్ ఇన్ బ్రీఫ్ 2025-2026 14వ పేజీలో బీఆర్‌ఎస్ సర్కార్ ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో తీసుకున్న అప్పు రూ. 3,01,484 కోట్లు ం రూ. 1,09,335 కోట్లు = రూ. 4,10,819 కోట్లు. ఇది కాంగ్రెస్ పార్టీనే తమ బడ్జెట్‌లో పెట్టిన లెక్క. కాగ్ రిపోర్ట్ ప్రకారం..బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పు రూ. 4,10,819 కోట్లు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ విడుదల చేసిన శ్వేతపత్రంలోని లెక్కల ప్రకారం బీఆర్‌ఎస్ చేసిన అప్పు రూ. 4,17 లక్షల కోట్లు.



పదేపదే అబద్ధాలు చెప్తూ, సవాళ్లు విసురుతూ మంత్రులు కాలుదువ్వడం.. ఆ సవాళ్లను బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ స్వీకరించి ఆధారాలతోపాటు చర్చకు వెళ్తే మంత్రులు తోకముడిచారు. బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేసి తమ అసమర్థతను చాటుకున్నారు. వాస్తవానికి బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పుతో గొప్ప సంపదను సృష్టించింది. జిల్లాకో మెడికల్, నర్సింగ్ కాలేజీ, కలెక్టరేట్లను నిర్మించింది. అద్భుతమైన సచివాలయం, భద్రతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్, కాళేశ్వరం లాంటి అనేక ప్రాజెక్టులను చేపట్టింది. రైతుబంధు, రైతు బీమాతోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, ఉచిత కరెంట్, గొర్రెలు, చేపల పిల్లల పంపిణీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయను చేపట్టింది. తెలంగాణ సంపదను పెంచిన ఘనత కేసీఆర్‌దే.

2026 మార్చి 18న అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పిన లెక్క ప్రకారం రెండున్నరేండ్లలో చేసిన అప్పు రూ. 3,47,294 కోట్లు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇపుడు చెప్తున్న లెక్క రూ. 3,85,600 కోట్లు. ఈ అప్పుతో రాష్ట్రంలో కొత్తగా కట్టిన ఒక్క ప్రాజెక్టునైనా చూపించగలరా? మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే వాటిని రిపేర్ చేయకుండా చోద్యం చూస్తూ నాశనం చేయాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్నది. కాళేశ్వరం ద్వారా నీళ్లు వస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే దుర్మార్గ ఆలోచనతో ప్రాజెక్టును పడావు పెడుతున్నది. పిల్లర్ల వద్ద ఇసుక తోడటం లాంటి కుట్రలకు పాల్పడుతున్నది. ప్రతి చుక్కనూ ఒడిసి పట్టుకునే అవకాశం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ కల్పించారు. కాంగ్రెస్ సర్కార్ ఆ పని చేయకుండా ప్రాజెక్టుల నుంచి లక్షల క్యూసెక్కుల నీటిని రోజూ వృథాగా పోనిస్తున్నది బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తే అడుగడుగునా అడ్డుకునే యత్నం చేసింది. కాంగ్రెస్ దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. త్వరలో ఓటు రూపంలో సమాధానం చెప్పి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# కంటి చూపు కల్పిస్తున్న సుశీకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి కి రుణపడి ఉంటాం

**ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య సేవలు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల కేంద్రంలో మూడవ రోజు శిబిరాన్ని దాదాపు 1000 మందికి పైగా సందర్శించగా, సుమారుగా 570 మందికి పైగా ఉచిత కంటి పరీక్షల నిర్వహణ చేయడం జరిగింది.350 కి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణి,35 మంది పేషేంట్లు కంటి శుక్లాల ఆపరేషన్ కు ఎంపిక కావడం జరిగింది.అన్ని వర్గాల ప్రజలకు కంటి వైద్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఢ టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ప్రముఖ శంకర నేత్రాలయ, చెన్నై వైద్య నిపుణుల సేవలతో తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సుంకిరెడ్డి-- మెగా ఉచిత కంటి వైద్య శిబిరం మూడో రోజూ విశేష ప్రజాదరణతో విజయవంతంగా కొనసాగింది,సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న అనేక మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన వైద్యం పొందలేకపోతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, వారి ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలను తీసుకురావాలనే సంకల్పంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు, శిబిరానికి తలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణి చేస్తూ ,కంటి శుక్లాలు గల వారికీ శస్త్రచికిత్స కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ సర్జికల్ యూనిట్ లో ఇక్కడే సర్జరీలకు సిద్ధం చేస్తున్నాము,దీంతో నిరుపేద కుటుంబాలకు వేల రూపాయల వైద్య ఖర్చులను లేకుండా పూర్తి ఉచిత సేవలతో క్యాంప్ నిర్వహిస్తూ అండగా నిలుస్తు,ఆరోగ్యం అనేది ప్రతి మనిషి ప్రాథమిక హక్కు,ఆర్థిక పరిస్థితులు ఎవరికీ నాణ్యమైన వైద్య సేవలకు అడ్డంకి కాకూడదనే ఆలోచనతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా సుంకిరెడ్డి ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు, మూడు రోజులుగా ఉచిత కంటి చూపు శిభిరాన్ని దాదాపు 2000 మందికి పైగా సందర్శించగా సుమారుగా 1200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా ?800 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణి తో పాటు 81 మందిని కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగింది,ఈ నెల 12వ తేదీ ఆదివారం వరకు ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరం కొనసాగనున్నందున, తలకొండపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో,సర్పంచ్ లు కళ్యాణ్ నాయక్,శ్రీనివాస్ ,రవి , ఉప సర్పంచ్ రమేష్ యాదవ్,మాజీ సర్పంచ్ లు నరేందర్ గౌడ్ ,శ్రీరాములు , ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యాదయ్య ,విజయ్ కుమార్ , రఘు ,శ్రీపతి ,శ్రీను ,భాస్కర్ లతో పాటు శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## మహా నీయుల బస్సు యాత్రలో దోకూరి ప్రభాకర్ రెడ్డి సేవలపై అభినందన



**శాలువాతో సన్మానించిన కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ మల్లురవి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

నాగర్ కర్నూల్ పార్లమెంటు పరిధిలో నిర్వహించిన మహనీయుల జ్ఞాన చైతన్య బస్సు యాత్రకి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి చేసిన సేవల పట్ల అభినందించిన ఎంపీ మల్లు రవి, నాగర్ కర్నూల్ పార్లమెంటు పరిధిలోనీ అన్ని నియోజకవర్గాలలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వివరించడానికి గత నెల రోజులుగా మహనీయుల జ్ఞాన చైతన్య బస్సు యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బస్సు యాత్రకు నెల రోజులు బస్సు కేటాయించి అన్ని విధాలుగా సహకరించి విజయవంతం కావడానికి కృషి చేసిన తలకొండ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి ని అభినందించి శాలువతో సన్మానించిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి, అనంతరం మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ కి సేవలను చేస్తున్న వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని ఆయన అన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ శిక్షణ



**లక్ష్యసాధనకు ఆత్మవిశ్వాసమే విజయానికి తొలి మెట్టు**
**దేవి లక్ష్మీ నరసయ్య**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

గోదావరిఖనిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ప్రత్యేక మోటివేషన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్ దేవి లక్ష్మీ నరసయ్య విద్యార్థులకు ప్రేరణాత్మక శిక్షణ అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో చదువుకుంటే విజయాన్ని తప్పకుండా సాధించగలరని అన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమయపాలన, నిరంతర శ్రమ ఉంటే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమేనని వివరించారు.పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం, పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవడం, రోజువారీ ప్రణాళిక ప్రకారం చదువుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని, విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులు కార్యక్రమం పట్ల ఆసక్తి వ్యక్తం చేస్తూ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి మోటివేషన్ శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు స్ఫూర్తిదాయకం



**125వ జయంతి సందర్భంగా ఘన నివాళులు**
**మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాద నాయకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి అన్నారు.డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, జమ్మూ--కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా పోరాడుతూ "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు" అనే నినాదంతో దేశ సమైక్యత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన ఉద్యమం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దేశ సమగ్రత, జాతీయవాద భావజాలం, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని కొనియాడారు.నేటి యువత మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. భారతీయ జనతా పార్టీ మహనీయుల ఆశయాల సాధనకు కట్టుబడి ప్రజాసేవలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య, బీజేపీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనరసయ్య, జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, బండారి శ్యామ్ పటేల్, అందే రాజ్‌కుమార్ చారి, పాకాల నరసింహారెడ్డి, పంగ రవి, బుంగ మహేష్, జక్కన బాలు, శిలారపు కళ్యాణ్, ఏరుగొండ తిరుపతి, గుండబోయిన సంతోష్, గుండబోయిన వెంకటేష్, గొడుగు సమ్మయ్య, సుంకరి సురేష్, పానుగంటి అశోక్, గడ్డం సురేష్, హనుమండ్ల వెంకటేష్, అంకరి భరత్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా



**ఆర్థిక సహాయం అందజేసిన ఆర్థిక బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గణేష్ రావు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వంగూరు మండల కేంద్రానికి చెందిన నారమోని పర్వతాలు అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంవ్, వంగూరు మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, వేనేపల్లి గణేష్ రావు, మరియు మాజీ సర్పంచ్ అక్కి లావణ్యఎల్లాగౌడ్, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు అలాగే మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమం లో, గ్రామ అధ్యక్షులు బండపల్లి జంగయ్య, గ్రామ ఉప సర్పంచ్ బండపల్లి భాస్కర్, వార్డు సభ్యులు సుమన్, అక్కి మురళి, నారమోని జంగయ్య, బండపల్లి శివకుమార్, లట్టుపల్లి మురళి,మరియు లట్టుపల్లి నిరంజన్ , రాఘవేందర్ గౌడ్, పిట్టల మల్లేష్, దామోదర్, భాషమోని కృష్ణ, బండపల్లి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు

## వాజేడు మండల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు ప్రజా పోరాట సమితి వినతి**
**బ్రిడ్జి, వైద్యం, పాఠశాలలు, ఇళ్లు, గ్రామ పంచాయతీపై ఐదు ప్రధాన డిమాండ్లు**

**అగ్నిధార న్యూస్ ,(ములుగు):**

వాజేడు మండలంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు ముత్తేబోయిన మహేందర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించింది.ఈ సందర్భంగా ముత్తేబోయిన మహేందర్ మాట్లాడుతూ, వాజేడు మండలంలోని గిరిజన గ్రామాలు మౌలిక సదుపాయాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ముఖ్యంగా చీకుపల్లి ఇసుకవాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో గోదావరి వరదల సమయంలో గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నాయని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు, నిత్యావసర సరుకుల రవాణా, విద్యార్థుల రాకపోకలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. పేరూరు ప్రాంతంలో 108 అంబులెన్స్ సౌకర్యంతో పాటు పూర్తి స్థాయి వైద్య సేవలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మండలంలోని ఆశ్రమ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారాయని, వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే ధన్యవరం, అయ్యవారిపేట ప్రాథమిక పాఠశాలలు, స్థానిక హైస్కూల్‌లకు కాంపౌండ్ వాల్స్ నిర్మించి ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మండలంలో అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని, అలాగే ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసం కొరకల్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.మండల ప్రజల న్యాయమైన సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాలని ముత్తేబోయిన మహేందర్ కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజల తరఫున ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గార రవికుమార్, కుమ్మరి శ్రీనాథ్, గగ్గూరి నాగేంద్రబాబుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ?ఇటిక్యాల గ్రామ దేవాలయాల అభివృద్ధికి పండుగలకు నీలం మధు ముదిరాజ్ అండ

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో త్వరలో జరగబోయే పండుగల సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ సంఘ రాష్ట్ర సీనియర్ నాయకులు, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ని మర్యాదపూర్వకంగా కలిసి, పండుగలకు రావాల్సిందిగా ఆహ్వానించడం జరిగింది.

?మన గ్రామంపై ఉన్న ప్రత్యేక అభిమానంతో, గ్రామ గుడుల అభివృద్ధి కోసం ఆయన ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రాబోయే పండుగలకు తప్పకుండా హాజరవుతానని మనస్ఫూర్తిగా హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి సాంప్రదాయాలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే నీలం మధు ముదిరాజ్ గారికి మన ఇటిక్యాల గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. ?ఈ కార్యక్రమంలో కొడారి రమేష్, ఎండీ అయూబ్, బత్తిని ప్రవీణ్, సీపతి ప్రశాంత్, కొడారి సందీప్, నర్సొళ్ల ఐలయ్య, బక్కోల్ల మల్లేష్, కడప కుర్మ కుమార్ బక్కోల సత్తయ్య, తుమ్మ సంతోష్, మెట్టు ప్రవీణ్, చిక్కుడు సుధాకర్ మరియు గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాల బేఖాతరు?..

### సీజ్ చేసిన భవనంలో యథేచ్ఛగా కార్యకలాపాలు

**కరీంనగర్ :** కరీంనగర్ నగరంలో హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ సీజ్ చేసిన భవనంలో కార్యకలాపాలు

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



**టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన జాజి మొగ్గలా రమేష్ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి ఇమ్రాన్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కి తెలియ జేయడంతో మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా 3000 రూపాయలు ఆర్థిక సహాయం ఇమ్రాన్ ద్వారా సీనియర్ నాయకుడు ఓరిగంటి వెంకటరెడ్డి 2000 ఉప సర్పంచ్ బూత్కూర్ వెంకట్ రెడ్డి 2000 పడితే పురం యాదయ్య 1000కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో, మాజీ తాజా మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్ ఉప సర్పంచ్ బొత్కూర్ వెంకటరెడ్డి వార్డ్ సభ్యులు బండగల జంగయ్య, రాజేష్, శేఖర్ గౌడ్, మాజీ గ్రామ అధ్యక్షుడు బొందల యాదయ్య, వడ్డే మౌని యాదయ్య, పురం యాదయ్య, యాదయ్య వల్లింపుల యాదయ్య రాజీవ్ గాంధీ రాములు వెంకటయ్య నరసింహా రమేష్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మాడుగుల మండలంలోని అవురుపల్లి గ్రామానికి చెందిన పోలే రాములు అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3000 మూడువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆమనగల్ మున్సిపల్ 5 వార్డు సభ్యులు కౌన్సిలర్ పాపిశెట్టి రాము 4000 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈకార్యములలో కిన్నెర తరుణ్ భాస్కర్ కిన్నెర మల్లేష్,పోలే చంద్రయ్యా మేస్త్రి ,దార్ల కృష్ణయ్య పోలే లక్ష్మయ్య గుడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా 3,38,26,448 మంది ఓటర్లు వుండగా ఇప్పటివరకు 3,06,21,142 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ అయ్యాయి. తెలంగాణలో 90.52 శాతం ఈఎఫ్ ల పంపిణీ పూర్తి అయింది. ఇప్పటివరకు 26,38,708 ఫారాల డిజిటైజేషన్ పూర్తి చేసారు. రాష్ట్రంలో ఈఎఫ్ ల డిజిటైజేషన్ 7.80 శాతం. నిర్మల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో 100 శాతం ఫారాల పంపిణీ అయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 34.88 శాతం డిజిటైజేషన్, కుమురం భీమ్ ఆసిఫాబాద్లో 27.91 శాతం డిజిటైజేషన్, నల్గొండలో 23.44 శాతం ఫారాల డిజిటైజేషన్ పూర్తి అయ్యాయి. ఖమ్మంలో 20.90 శాతం డిజిటైజేషన్ నమోదు అయింది. మేడ్చల్ మల్కాజిగిరిలో డిజిటైజేషన్ కేవలం 1.08 శాతం, రంగారెడ్డిలో 2.48 శాతం.. వికారాబాద్లో 2.67 శాతం నమోదయ్యాయి.

# మొబైల్ యాప్‌తో సంబంధం లేకుండా సబ్సిడీ ఎరువులు ఇవ్వాలి

**నకిలీ విత్తనాలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఏఐకేఎంఎస్ డిమాండ్**
**పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాలన్న రైతు-కూలీ సంఘం**

**అగ్ని ధార న్యూస్ ,(అంతర్గాం):**

రైతులకు మొబైల్ యాప్‌లతో సంబంధం లేకుండా యూరియా, ఇతర ఎరువులను సబ్సిడీపై అందజేయాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) డిమాండ్ చేసింది. నకిలీ విత్తనాల విక్రయాన్ని పూర్తిగా అరికట్టి, వాటిని సరఫరా చేసే డీలర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.అంతర్గాం మండలం పెద్దంపేట్‌లోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం, జిల్లా కార్యదర్శి కొల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. రైతులకు ఎరువుల పంపిణీలో మొబైల్ యాప్‌ను



తప్పనిసరి చేయడం వల్ల మొబైల్ ఫోన్‌లు లేని పేద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరికీ ఎలాంటి సాంకేతిక అవరోధాలు లేకుండా సబ్సిడీ ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, నకిలీ విత్తనాల కారణంగా రైతులు భారీగా నష్టపోతున్నారని, నకిలీ విత్తనాలు సరఫరా చేసే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటూ పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. రైతుల పంట రుణాలను ఒకేసారి పూర్తిగా మాఫీ చేసి, కొత్త పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మేరుగు చంద్రయ్య, జిల్లా నాయకులు ఐ. రాజేశం, దోనూరి రాజమౌళి, గుండు రాజయ్య, కాదాసి లింగమూర్తి, ఎల్. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ ఎనలేని సేవలు

**అంబేద్కర్ ఆశయాలను కార్యరూపంలోకి తీసుకెళ్లిన మహానేత**
**40వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయం, సమానత్వ ఆశయాలను కార్యరూపంలోకి తీసుకెళ్లడంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ అన్నారు.బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు, రిజర్వేషన్ ఫలాలు దేశంలోని దళితులు, అణగారిన వర్గాలకు అందేలా బాబు జగ్జీవన్ రామ్ విశేష కృషి చేశారని కొనియాడారు. చిన్నతనం నుంచే సామాజిక సేవ పట్ల అంకితభావంతో పనిచేసిన ఆయన, కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన అరుదైన నాయకుడని పేర్కొన్నారు.

దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అర్హత ఉన్నప్పటికీ, కుల వివక్ష కారణంగానే బాబు జగ్జీవన్ రామ్‌కు ఆ అవకాశం




దక్కలేదని కొంకటి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను నేటి తరం కొనసాగించి సామాజిక సమానత్వ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కో-కన్వీనర్ గజ్జల శశిభూషణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర కార్యదర్శి ఇరుగురాల కృష్ణయ్య, జిల్లా కో-కన్వీనర్ ఆకునూరి బాల అంకుష్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు బొచ్చు శంకర్, ఏఐటీయూసీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. కరీం, డీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు కనకం గణేష్, జిల్లా నాయకులు బూడిద సమ్మయ్య, ఆకునూరి రాజయ్య, మడిపల్లి శ్రీనివాస్, పుల్లూరి మహేందర్, ఇందారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులర్పించారు.

# రూ.100 కోట్ల నిధులు సిద్ధం...

**రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి మాత్రం ఎక్కడ?**
**జిల్లా యంత్రాంగం జాప్యంతో లక్షలాది కార్మికులకు వైద్య సేవలు దూరం**
**ప్రజావాణిలో కలెక్టర్‌కు స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక వినతి**
**స్థల సేకరణ పూర్తిచేసి వెంటనే నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

దేశానికి బొగ్గు, విద్యుత్, ఎరువుల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి ఇప్పటికీ పూర్తి స్థాయి ఈఎస్ఐ ఆస్పత్రి అందుబాటులోకి రాకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆవేదన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా, రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని ఆమోదించినా, జిల్లా స్థాయిలో జాప్యం కారణంగా వేలాది మంది కార్మికులు నేటికీ నాణ్యమైన వైద్య సేవలకు దూరమవుతున్నారని పేర్కొంది.సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ప్రతినిధులు, రామగుండంలో 100 పడకల ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### 2018లో అనుమతి... 2025లో స్థలం ఆమోదం... అయినా పనులు శూన్యం

ప్రతినిధులు వివరించిన ప్రకారం, 2018లోనే కేంద్ర ప్రభుత్వం రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి సూత్రప్రాయంగా అనుమతి ఇచ్చింది. అయితే అప్పట్లో కేటాయించిన స్థలం స్మశాన వాటిక, చెత్త డంపింగ్ యార్డు సమీపంలో ఉండటంతో పాటు రహదారి సౌకర్యం లేకపోవడంతో ఈఎస్ఐ అధికారుల బృందం తిరస్కరించింది.



ఆ తరువాత ఈఎస్ఐ నూతన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన విస్తీర్ణంతో కూడిన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2025 జనవరి 8న ఆమోదించినప్పటికీ, ఇప్పటివరకు నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందన్నారు.

### ఐదు జిల్లాల కార్మికులకు ఒకే ఆశ... ఈఎస్ఐ ఆస్పత్రి

రామగుండం ఈఎస్ఐ బ్రాంచ్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన సుమారు 60 వేల మంది ఈఎస్ఐ చందాదారులు, వారి కుటుంబ సభ్యులు ఈ ఆస్పత్రిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు.సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సిమెంట్ పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలలు, షాపింగ్ మాల్స్, బీడీ పరిశ్రమలు, వీవింగ్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు అత్యవసర వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### నిధులు ఉన్నా... నిర్మాణం ఎందుకు లేదు?

కేంద్ర ప్రభుత్వం ఈ ఆస్పత్రి నిర్మాణానికి రూ.100 కోట్ల వరకు నిధులు అందుబాటులో ఉంచినప్పటికీ, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పనులు ప్రారంభం కాకపోవడం బాధాకరమని ప్రతినిధులు విమర్శించారు. కార్మికుల ఆరోగ్య హక్కు విషయంలో జాప్యం ప్రదర్శించడం సమంజసం కాదని, ఇకపై ఆలస్యం చేయకుండా భూ సేకరణ, పరిపాలనా అనుమతుల ప్రక్రియను పూర్తి చేసి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

### ప్రజా ప్రయోజనాలే లక్ష్యం


పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి కార్మికుల ఆరోగ్య భద్రత అత్యంత కీలకమని, పూర్తి స్థాయి ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు వల్ల వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రతినిధులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక నాయకులు మద్దెల దినేష్, డా. దుర్గం నగేష్, గొలివాడ చంద్రకళ, కంది సుజాత, కొండు రామాదేవి, వై. లెనిన్, కె. రవి తదితరులు పాల్గొన్నారు.

# డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

**జాతీయ సమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు : బీజేపీ నాయకులు**

(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 6 : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు.పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వెల్పుల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మాట్లాడుతూ, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆధునిక భారతదేశ నిర్మాణంలో విశిష్ట పాత్ర పోషించిన గొప్ప జాతీయవాది, రాజనీతిజ్ఞుడని పేర్కొన్నారు. కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా, అనంతరం ప్రజాప్రతినిధిగా, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా దేశానికి సేవలందించారని తెలిపారు. 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ జాతీయవాద శక్తికి నాంది పలికారని అన్నారు.జమ్మూ--కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు కోసం ఆయన జీవితాంతం పోరాటం చేశారని, ఆ ఉద్యమంలో భాగంగానే కాశ్మీర్‌లో నిర్బంధంలో ఉండగా 1953 జూన్ 23న అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారని గుర్తుచేశారు.



అనంతరం 2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేసి డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాన్ని సాకారం చేసిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు తంగే రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, ఈర్ల శంకర్, ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్, మామిడి ఉమేష్, కోశాధికారి గాదసి సతీష్, కార్యదర్శి పోగుల రాజు, ముంజ రాజేంద్రప్రసాద్, కుషనపల్లి మధు, సండే శివసాయి, కుక్క అంజి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వామపక్ష నాయకులకు 'మాకు చరిత్ర ఉంది' పుస్తకం అందజేత



**ప్రజా ఉద్యమాల చరిత్రను భావితరాలకు చేరవేయాలన్నదే లక్ష్యం**
**ఇంద్రపార్క్ బహిరంగ సభలో రచయిత చొరవ**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా 'మాకు చరిత్ర ఉంది' పుస్తకాన్ని ప్రముఖ వామపక్ష నాయకులకు అందజేశారు. రచయితతో పాటు వై. యాకయ్య, కామ్రేడ్ సాయిలు ఈ పుస్తకాలను నాయకులకు అందించి సామాజిక ఉద్యమాల చరిత్రపై చర్చించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోనమనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎస్. వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కామ్రేడ్ సత్యం, కామ్రేడ్ జ్యోతి, కామ్రేడ్ కలవేని శంకర్, కామ్రేడ్ సదానందం, కామ్రేడ్ గోవర్ధన్, ఎంఎల్ పార్టీ నాయకులు మాస్టైతో పాటు పలువురు నాయకులు పుస్తకాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలు, అణగారిన వర్గాల పోరాటాలు, సామాజిక మార్పు కోసం జరిగిన చారిత్రక ఘటనలను లిఖితపూర్వకంగా నమోదు చేయడం అత్యంత అవసరమన్నారు. సమాజం మరుగునపడిన చరిత్రను వెలికితీసి భావితరాలకు అందించే ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొన్నారు.రచయిత మాట్లాడుతూ.. 'మాకు చరిత్ర ఉంది' పుస్తకం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం కోసం సాగిన ఉద్యమాల చరిత్రను ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో ఈ గ్రంథాన్ని రచించినట్లు తెలిపారు. చరిత్రను తెలుసుకోవడం ద్వారా నేటి తరానికి ఉద్యమాల స్ఫూర్తి అందుతుందని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో ఇటువంటి గ్రంథాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.బహిరంగ సభకు హాజరైన పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పుస్తకాన్ని ఆసక్తిగా పరిశీలించి రచయితను అభినందించారు.

## నేతకాని మహార్ సేవా సంఘం జిల్లా ఇన్చార్జీల నియామకం



**సంస్థను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని నిర్ణయం : దుర్గం స్వామి**
**మంచిర్యాల జిల్లా ఇన్చార్జీగా శ్రీకాంత్**
**మహిళా ఇన్చార్జీగా రామటెంకి విజయ**
**పెద్దపల్లి జిల్లా మహిళా ఇన్చార్జీగా దుర్గం ప్రమీల**

**అగ్ని ధార న్యూస్ ,(మంచిర్యాల):**

తెలంగాణ నేతకాని మహర్ సేవా సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కమిటీ పునర్వ్యవస్థీకరణ, జిల్లా స్థాయిలో ఇన్చార్జీల నియామకంపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.?ఈ కార్యక్రమానికి సమతా సైనిక దళ్ ఉత్తర తెలంగాణ ఇన్చార్జ్, సమత ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్, రాష్ట్ర నాయకులు జనగామ తిరుపతి, గట్టు భానేష్, దుర్గం రాజయ్య, కిరణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని, నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి సేవలు అందించాలని తీర్మానించారు.జిల్లా ఇన్చార్జీల నియామకం:ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా ఇన్చార్జీగా శ్రీకాంత్, మహిళా ఇన్చార్జీగా రామటెంకి విజయ, మరియు పెద్దపల్లి జిల్లా మహిళా ఇన్చార్జీగా దుర్గం ప్రమీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఇన్చార్జీలకు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నేతకాని కుల అభివృద్ధి, జాతి ప్రయోజనాల పరిరక్షణ కోసం శక్త్యంచన లేకుండా పనిచేస్తామని, నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి నుండి ప్రజలను ఏకం చేస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో జాడి అనిత, జాడి ప్రమీల, దుర్గం మహేందర్, అగిడి భీమరాజు, కొండగోర్ల మహేష్, కామెర గణేష్, జమ్మిడి రాజేష్ తదితర ముఖ్య నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల తరగతి గదుల సీజ్

**అగ్నిధార న్యూస్ సుల్తానాబాద్**

సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య యూపీఎస్ పాఠశాల కు నర్సరీ నుండి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ ప్రభుత్వ అనుమతి లేకుండా ఉన్నత తరగతులను నిర్వహించడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న తరగతి గదులను సీజ్ చేయడం జరిగిందనీ మండల విద్యాధికారి రాజయ్య తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని వివిధ గ్రామాల మరియు మున్సిపాలిటీ పరిధిలోని తల్లిదండ్రులు తమ పిల్లలను అటువంటి అనుమతి లేని తరగతుల్లో చేర్పించకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో,ప్రభుత్వ అమోదం పొందిన పాఠశాలల్లో మాత్రమే చేర్పించాలని తెలియజేశారు.సంబంధిత పాఠశాల యాజమాన్యం వెంటనే ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 8వ, 9వ, 10వ తరగతులను నిలిపివేసి, విద్యాశాఖ నిబంధనలను పాటించవలనీ లేదా వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారుల నుండి అనుమతి మంజూరు చేయించుకొని పైన తెలుపబడిన మూడూతరగతులు నిర్వహించుకోవాలని లేని పక్షంలో సంబంధిత పాఠశాల పై ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు విద్యాశాఖ నిబంధనల ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయనీ హెచ్చరించారు.



# కల్వకుర్తిలో మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యం

**మెనూ పాటించకుండా విద్యార్థుల ఆరోగ్యంతో వంట సిబ్బంది చెలగాటం**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆరోపించారు.. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ వార్డులోని ప్రాథమిక పాఠశాలను మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,స్థానిక వార్డు కౌన్సిలర్ నాజియా మక్బూల్ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసే సిబ్బంది విధుల పట్ల తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కల్వకుర్తి మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వంట చేయకుండా మధ్యాహ్న భోజన వంట సిబ్బంది తమ ఇష్టం వచ్చినట్లుగా



ఆహారం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యం వల్ల నిరుపేద విద్యార్థులకు సరైన భోజనం అందక ఆకలితో ఇబ్బంది పడుతున్నారని నాణ్యత లేని ఆహారం వల్ల వారి ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో, ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మధ్యాహ్న భోజన వంట సిబ్బందిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

**కల్వకుర్తి మండల విద్యాధికారి స్పందన...**

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట సిబ్బంది ఇష్టారాజ్య వ్యవహారంపై కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ చేసిన ఫిర్యాదును స్వీకరించిన మండల విద్యాధికారి శంకర్ నాయక్ స్పందిస్తూ తక్షణమే ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల భోజన విషయంలో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి,నాయకులు సోఫీ,దున్న సురేష్,పడకంటి వెంకటేష్,మహేష్,తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలి

**ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణ కేంద్రంలో గత 68 రోజులుగా నిర్విరామంగా కొనసాగిన ఉచిత పోలీస్ ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు,

ఈ సందర్భంగా శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులను అభినందించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు, శిక్షణతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసమే విజయానికి పునాదులని పేర్కొంటూ, ప్రతి అభ్యర్థి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు,ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతతో పాటు సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు,పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధమైన చదువు, శారీరక దృఢత్వం, సమయపాలన, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని తెలిపారు,అపజయాలను చూసి నిరుత్సాహపడకుండా, ప్రతి ప్రయత్నాన్ని విజయానికి మార్గంగా మలుచుకోవాలని యువతకు సూచించారు, గత 68 రోజులుగా శిక్షణ తరగతులను క్రమం తప్పకుండా



సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించి,ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు వారి ఉద్యోగ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు,

అలాగే భవిష్యత్తులో కూడా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ ఫ్యాక్టరీ" ద్వారా ఎ ఐ భాషా నైపుణ్యాలు, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, కల్వకుర్తి నియోజకవర్గ యువతకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగి అనే లక్ష్యంతో తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు,శిక్షణ పొందిన అభ్యర్థులు మాట్లాడుతూ,ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందించి తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు, ఈ శిక్షణ తమ ప్రభుత్వ ఉద్యోగ లక్ష్య సాధనకు ఎంతో ఉపయోగపడిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని కోరాతూ,ఖర్చు తో కూడా ఈ శిక్షణ తరగతులను మారుమూల గ్రామీణ యువతకు అందరికి అందుబాటులోకి తెచ్చి ఉద్యోగాల సాధనలో మన నియోజకవర్గయువతకు దిక్సూచిగా మారిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి రుణపడి ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో..ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్ తో పాటు శిక్షణ పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లు యజమానిపై పీడీ యాక్ట్ అమలు

**చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించం:పోలీస్ కమిషనర్**

అగ్నిధార న్యూస్ సుల్తానాబాద్

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆహార భద్రతా పథకాలకు భంగం కలిగిస్తూ, ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించి ప్రజల హక్కులను హరిస్తున్న వారిపై రామగుండం పోలీస్ కమిషనరేట్ రాజీ లేని వైఖరిని అవలంబిస్తోంది. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం కలిగించడమే కాకుండా,ప్రజలకు అందాల్సిన నిత్యావసర ధాన్య సరఫరా వ్యవస్థను దెబ్బతీసే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే..కరీంనగర్ జిల్లా కట్టరాంపూర్‌కు చెందిన బండారి మారుతి (43) సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలో గల సాయి మహాలక్ష్మి ఇండస్ట్రీస్, సౌభాగ్యలక్ష్మి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్నర్‌పై ప్రివెన్షన్ ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ సప్లైస్ ఆఫ్ ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్--1980 కింద ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ అమలు చేయబడిందనీ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈరోజు సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. రంజిత్‌రావు, సుల్తానాబాద్ సబ్‌ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ కరీంనగర్ జిల్లా జైలుకు వెళ్లి,జైలర్ సమక్షంలో నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులను అందజేసిఅనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసు దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం 2023--24 రబీ, ఖరీఫ్ సీజన్లలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థతో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్న నిందితుడు మొత్తం 11,213.040 మెట్రిక్ టన్నుల వరిని స్వీకరించి, ప్రభుత్వానికి అప్పగించాల్సిన 7,624.867 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయకుండా అక్రమంగా ఇతర రైస్ మిల్లులకు విక్రయించినట్లు తేలింది.ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి రూ.27 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది.

నిందితుడిపై 2024 నుంచి 2026 వరకు పెద్దపల్లి,కరీంనగర్ జిల్లాల్లో నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయనీ సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అనంతరం కూడా అదే తరహా నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించి ప్రస్తుతం మరో కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అతను తిరిగి విడుదలైతే మళ్లీ ప్రజా పంపిణీ వ్యవస్థకు భంగం కలిగించే అవకాశం ఉన్నందునప్రజా ప్రయోజనాల దృష్ట్యా పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్




మాట్లాడుతూ..ప్రభుత్వ ధాన్యం అనేది పేదల హక్కనీ ఆ ధాన్యాన్ని అక్రమంగా దోచుకుని బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమనీప్రజల ఆహార భద్రతకు భంగం కలిగించే వారిపై సాధారణ క్రిమినల్ కేసులే కాకుండా అవసరమైతే పీడీ యాక్ట్‌తో పాటు చట్టంలో ఉన్న కఠిన నిబంధనలను అమలు చేస్తామనీ సీఎంఆర్ బియ్యం అక్రమ దారిమళ్లింపులో పాల్గొన్న ప్రతి వ్యక్తిని నిర్వాహకుడికీ సహకరించిన వారిని లబ్ధి పొందిన వారిని గుర్తిస్తామని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారిమళ్లించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. అక్రమాలకు పాల్పడే వారు వెంటనే తమ కార్యకలాపాలను విరమించుకోవాలనీ లేకపోతే పీడీ యాక్ట్‌తో పాటు కఠినమైన చట్టపరమైన నిర్బంధ చర్యలు తప్పవనీ ఆయన హెచ్చరించారు.ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం,నిల్వ చేయడం,రవాణా చేయడం, విక్రయించడం లేదా ఇటువంటి నేరాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించే వారిపైనా సమానంగా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.ఈ కేసులో పీడీ యాక్ట్ అమలుకు కృషి చేసిన పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్‌రావు,ఎస్సై చంద్రకుమార్‌లను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## సివిల్ విభాగం వాల్వ్ ఆపరేటర్లకు ప్రమోషన్ ఆర్డర్ల పంపిణీ




**సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో కార్యక్రమం**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్‌లో యాక్టింగ్ వాల్వ్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సోమవారం ప్రమోషన్ ఆర్డర్లను అందజేశారు.సివిల్ డిపార్ట్మెంట్ డీజీఎం వరప్రసాద్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సివిల్ డిపార్ట్మెంట్ పిట్ సెక్రటరీ దాసరి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రమోషన్ ఆర్డర్లను పంపిణీ చేశారు. యాక్టింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్న కార్మికులకు అధికారికంగా ప్రమోషన్ లభించడం పట్ల కార్మికులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ, విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు తగిన గుర్తింపు లభించడం సంతోషకరమని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముగ్గురు కార్మికులకు ప్రమోషన్ ఆఫీస్ ఆర్డర్లు అందజేయగా, జనరల్ అసిస్టెంట్ ప్రేమలతకు కూడా ఆర్డర్ కాపీ అందించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రవీణ్, సూపర్వైజర్ రవికుమార్, ఏఐటీయూసీ రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు బిట్టి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు బొల్లి శ్రీనివాస్, అటికేటి రాజు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## విరసం సభను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

**పూర్వ విప్లవ ఉద్యమాల మిత్రుడు రాజన్న విమర్శ**

అగ్నిధార న్యూస్,( రామగుండం):

విప్లవ రచయితల సంఘం (విరసం) సభను అడ్డుకోవడం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని పూర్వ విప్లవ ఉద్యమాల మిత్రుడు రాజన్న విమర్శించారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలకు సందేశం ఇస్తున్నారని, అయితే తెలంగాణలో మాత్రం ప్రజాస్వామ్య హక్కులు, సభల స్వేచ్ఛకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణలో సభలు, సమావేశాల నిర్వహణ విషయంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. గత ప్రభుత్వాన్ని విమర్శించిన అంశాలనే ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు.

ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాజన్న కోరారు.

## మీ బూత్--మీ బాధ్యత'తో సమన్వయంగా పనిచేయాలి



**బీఎల్ఏలకు దిశానిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సూచించారు.గంగానగర్ పట్టణ అధ్యక్షుడు అచ్చ వేణు అధ్యక్షతన నిర్వహించిన 5వ డివిజన్ బీఎల్ఏల సమీక్ష సమావేశానికి రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఏలు పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు.ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.సమావేశం అనంతరం రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకురాలు మూల విజయరెడ్డి, 5వ డివిజన్ ఇన్‌చార్జి సకినాల ప్రతాప్, మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి, అల్లం ఐలయ్యతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు ఆహ్వానం

**మాజీ మంత్రులు కల్వకుంట్ల రామారావు తన్నీరు హరీష్ రావు ఆహ్వానశీ.**

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

జగదేవపూర్ మండలం లోని ఇటిక్యాల గ్రామంలో నిర్వహించనున్న శ్రీ పెద్దమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, బి అర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ రామారావు కు సోమవారం ఇటిక్యాల గ్రామ మాజీ సర్పంచ్ రవికంటి చంద్రశేఖర్ గుప్తా, సర్పంచ్ దిన రాజలింగం,ఉప సర్పంచ్ నరేష్ ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ నెల 7,8,9 న నిర్వహించే విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ తెలిపారు. గ్రామ దేవతల విగ్రహం మహోత్సవ అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని శ్రీ పెద్దమ్మ తల్లి దుర్గమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో,వార్డు సభ్యులు అనిల్ భాస్కర్,మౌనిక ప్రకాశ్,బాబు, స్వామి,నాయకులు స్వామి,జానకి రాములు,మల్లేష్, సాయిలు,నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలి

**ఆర్జీ-1 జీఎంకు ఏఐటీయూసీ వినతి**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

కేడర్ స్కీమ్ ప్రకారం అర్హత సాధించిన సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓఎంహెచ్)లకు తక్షణమే ఓవర్‌మెన్ గ్రేడ్-బి ప్రమోషన్లు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్జీ-1 బ్రాంచి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆర్జీ-1 జనరల్ మేనేజర్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, 2016, 2017 బ్యాచ్‌లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్‌లు కేడర్ స్కీమ్ ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసి ఓవర్‌మెన్ గ్రేడ్-బి హోదాకు అర్హత సాధించినప్పటికీ, ఖాళీలు లేవనే కారణంతో ప్రమోషన్లు నిలిపివేశారని ఆరోపించారు. మరోవైపు, ప్రమోషన్లు ఇవ్వకుండానే వారితో ఓవర్‌మెన్ విధులు నిర్వహింపజేయడం వల్ల వాస్తవ ఖాళీలు కనిపించకుండా పోతున్నాయని, దీంతో అర్హులైన ఉద్యోగులు



మూడు సంవత్సరాలుగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

కేడర్ స్కీమ్ లక్ష్యాలకు విరుద్ధంగా ఈ పరిస్థితి కొనసాగుతోందని, అర్హులైన సీనియర్ మైనింగ్ సర్దార్‌లందరికీ వెంటనే ఓవర్‌మెన్ గ్రేడ్-బి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు వారికి వారి హోదాకు సంబంధించిన విధులను మాత్రమే అప్పగించాలని కోరారు. అలాగే సంస్థలో ఉన్న ఓవర్‌మెన్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లపై యాజమాన్యం స్పందించకపోతే జూలై 22 మొదటి షిఫ్ట్ నుంచి సీనియర్ మైనింగ్ సర్దార్‌లు కంపెనీ ఆఫీస్ ఆర్డర్ ప్రకారం తమ హోదాకు సంబంధించిన విధులు మాత్రమే నిర్వహిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ-1 బ్రాంచి ఆఫీస్ బేరర్లు మాదన మహేష్, సిద్ధమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, గండి ప్రసాద్, పిట్ కార్యదర్శులు ఇజ్జగిరి రాజు, మైనింగ్ స్టాఫ్ నాయకులు పెర్క మహేందర్, శ్రీనివాస్, గొడిశెల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డు కాలనీలకు తక్షణమే తాగునీరు అందించాలి

**మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులకు అధికారులకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం పట్టణంలోని హౌసింగ్ బోర్డు పరిధిలోని ఆదర్శనగర్, శ్రీరామ్‌నగర్ కాలనీలకు గత రెండు నెలలుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతినడంతో కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ విషయాన్ని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అయోధ్య సింగ్, నగర మేయర్ మహంకాళి స్వామికి తెలియజేయడంతో వారు వెంటనే స్పందించి సంబంధిత మున్సిపల్, మిషన్ భగీరథ



అధికారులను ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు కాలనీవాసుల సమక్షంలో దెబ్బతిన్న పైప్‌లైన్‌ను పరిశీలించి, రెండు నుంచి మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యను వెంటనే గుర్తించి స్పందించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అయోధ్య సింగ్, నగర మేయర్ మహంకాళి స్వామికి హౌసింగ్ బోర్డు కాలనీవాసుల తరఫున పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ పటేల్, సాధుల శివ, అగ్గు అజయ్, పాకాల నాగరాజు, బోరిగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో “సర్” కార్యక్రమం పారదర్శకంగా జరుగుతోంది.

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.**

**జయశంకర్ భూపాలపల్లి :** జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, చురుకుగా జరుగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.?ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లను చేర్చడం, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించడం మరియు ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో అవసరమైన సవరణలు మార్పులు, చేర్పులు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.?ఫారాల పంపిణీ మరియు స్వీకరణజిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 98 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యూమ రేషన్ ఫారాలను పూర్తి చేసి, తిరిగి స్వీకరించే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోందని తెలిపారు.?డిజిటలైజేషన్ ప్రక్రియ సేకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సమాంతరంగా పకడ్బందీగా సాగుతోందని, ఇప్పటివరకు 9 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. దీనివల్ల ఓటర్ల జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందుతుందని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 317 మంది బూత్ లెవల్ అధికారులు ఈ ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఓటర్లకు మరియు ప్రజలు ఏదేని సలహాలు, సూచనలకు బూతు స్థాయి సిబ్బందిని కానీ మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించొచ్చని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో తగిన సహాయం అందిస్తారని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇది పూర్తిగా నిబంధనలకు లోబడి, అత్యంత పారదర్శకంగా జరుగుతున్న ప్రక్రియ అని, అర్హులైన వారందరూ తమ వివరాలను సకాలంలో అందించి, ఓటు హక్కు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐ టీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించాలని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో ఐకమత్యం, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ధన్వాడ గ్రామ ప్రజలు ఐక్యంగా కలిసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, యువతకు మంచి అవకాశాలు లభించాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబురి చేతుల మీదుగా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

**---గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్**

**చొప్పదండి :** భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనకు ఘన నివాళులు

## ఫార్మా రంగంలో... అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న తెలంగాణ

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

మర్కుక్ మండలంలోని కర్కపట్ల ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్రం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కర్కపట్ల బయోటెక్ పార్కులో సిరో ఫార్మా కంపెనీని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రం ఫార్మాకు బ్రాండ్ ఇమేజ్ సాధించుకొని అదే పరంపర కొనసాగిస్తుండగా, క్యాన్సర్ నిర్మూలనకు సిరో ఫార్మా చక్కటి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రతి 10 మందిలో 5 గురు క్యాన్సర్ బారిన పడుతుండగా, భవిష్యత్తులో క్యాన్సర్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యాన్సర్ కు సంబంధించిన ఔషదాలను రోగులకు తక్కువ ధరలో అందించడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. అయితే పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉండగా, ఇకో సిస్టమ్ ను ఇంకా బలోపేతం చేసి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున పెట్టు బడులను ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాగా రాష్ట్రంలో 2260కి పైగా ఫార్మా కంపెనీలు ఉండగా, ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున ఫార్మా పరిశ్రమలు ఏర్పాటు కాలేదని గుర్తు చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రగతి, పరిశ్రమల ఏర్పాటు, ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫార్మాను ప్రతిపక్ష పార్టీలు అడ్డుకుంటుండగా, తాము వెనక్కి తగ్గడం లేదని అన్నారు. అలాగే మింట్ పాలసీని ఆపాలని చూస్తున్నప్పటికీ సరికొత్త వ్యూహాలతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. అంతే కాకుండా జహీరాబాద్ లో నేషనల్ మోడల్ మాన్యుఫాక్చరింగ్ జోన్ చేయాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రాబోయే కాలంలో రాష్ట్రం నుండి లైఫ్ సైన్సెస్ క్యాపిటల్ గా రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరో సంస్థ చైర్మన్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూలపల్లి లో ఉచిత వైద్య శిబిరం:---



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

జూలపల్లి గ్రామ ప్రజల ఆరోగ్య లక్ష్యంగా గ్రామ అభివృద్ధిలో భాగంగా సోమవారం పెద్దపెల్లి జిల్లా కమాన్పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అపోలో రిచ్ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం జూలపల్లిసర్పంచ్ పోలు దాసరి వనిత సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ వైద్య శిబిరంలో ఈసీజీ షుగర్ బిపి న్యూట్రిషన్ ఉచిత పరీక్షలు ఉచిత మందులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వేముల సత్యనారాయణ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు మహిళలు డాక్టర్లు హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొనడం జరిగింది

## శ్రమదానంతో ముళ్లపొదలను తొలగించిన వాకర్స్..

**హుజురాబాద్ :** ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా హుజురాబాద్ మునిసిపల్ పరిధిలోని సైదాపూర్ రోడ్ లో గల ఎస్సారెస్పీ కెనాల్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు శ్రమదానంతో ముళ్ళ పొదలను తొలగించారు. గత కొన్నాళ్లుగా కెనాల్ వాకర్స్ కు వాకింగ్ చేసేందుకు ముళ్ళ చెట్లు ఇతర చెట్ల కొమ్మలు గుంతలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని సంబంధిత మున్సిపల్ అధికారులకు సిబ్బందికి వాకర్స్ నాయకులు

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



**జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి.**

**ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన డిఆర్ఓ.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూలై 06:**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా చూడాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన ఏ లక్ష్మి తమ గ్రామ నందు ఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయా పోస్ట్ తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన మహంకాళి వీరమ్మ, గొట్టె లింగమ్మ సర్వేనెంబర్ 294 నందు ప్రభుత్వం తరఫున ఉమ్మడిగా బోర్వెల్ ఏర్పాటు చేయుట గురించి దరఖాస్తు చేసుకోగా ఈడీఎస్సీ కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

మంథని పట్టణం రాఘవ ఊర్ల నగర్ కు చెందిన భీమనపల్లి సురేందర్ తన కుమార్తెకు ఏదైనా బిసి గురుకుల పాఠశాలలో 8వ తరగతి నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా గురుకుల పాఠశాల సొసైటీ అధికారుల కొరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ , సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ డి. విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**అక్రమ వసూళ్లపై విచారణ జరిపి నిధులు విడుదల చేయాలి**

**డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేసి, పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బీఏఎస్ పథకం కింద ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచితంగా అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఇతర విద్యా సామగ్రిని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అందించకుండా తల్లిదండ్రులతో కొనుగోలు చేయిస్తున్నాయని ఆరోపించారు. ఇది ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధమని, పేద విద్యార్థుల విద్యా హక్కులను హరించే చర్యగా అభివర్ణించారు. పథకం అమలులో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని, పుస్తకాలు, అదనపు ఫీజుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై ప్రత్యేక విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం నుంచి పాఠశాలలకు చెల్లించాల్సిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, ఎస్సీ అభివృద్ధి అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పథకం అమలును పర్యవేక్షించాలని కోరారు. అర్హత కలిగిన అన్ని ప్రైవేట్ పాఠశాలలను బీఏఎస్ పథకం పరిధిలోకి తీసుకువచ్చి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తగిన సీట్లు కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోకపోతే సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

## యూట్యూబర్ రావణ్ అరెస్టును ఖండించిన సమతా సైనిక దళ్

**హైకోర్టు సుమోటోగా స్వీకరించి విడుదల చేయాలి**

**డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్,(హైదరాబాద్):**

ఆంధ్రప్రదేశ్‌లో యూట్యూబర్ రావణ్ అరెస్టు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రముఖ రాజకీయ నాయకుడు పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రావణ్‌ను అరెస్టు చేసిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రావణ్ మాట్లాడిన అంశాల్లో చట్టపరమైన అంశాలను న్యాయస్థానాలే తేల్చాలని, అయితే బెయిల్ లభించినప్పుడల్లా కొత్త సెక్షన్లు జోడిస్తూ మళ్లీ మళ్లీ కేసులు నమోదు చేయడం కక్షసాధింపు చర్యగా కనిపిస్తోందని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రభుత్వాలు భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవాల్సిన పాలకులు విమర్శలను అణచివేసే ధోరణిని అవలంబించడం సరికాదని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలను నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రావణ్ ఒక ధిక్కార స్వరంగా ప్రజల్లో నిలిచారని, ఇలాంటి చర్యలతో ప్రజల గొంతును పూర్తిగా అణచివేయడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. విమర్శలను సహనంతో స్వీకరించి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. రావణ్ కేసులో గౌరవ హైకోర్టు సుమోటోగా జోక్యం చేసుకుని చట్టపరమైన అంశాలను పరిశీలించాలని, ఆయన విడుదలకు తగిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు.

## కోట ఏసు రత్నంను పరామర్శించిన డా. మార్షల్ దుర్గం నగేష్

**అగ్నిధార న్యూస్ ,(గోదావరిఖని):**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మేడిపల్లి,(న్యూపోరట్పల్లి)కి చెందిన కోట ఏసు రత్నంకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆసుపత్రిని సందర్శించిన ఆయన బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ ప్రమాద తీవ్రత కారణంగా బాధితుడికి శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని కోరారు. పేద కుటుంబానికి చెందిన బాధితుడికి అవసరమైన అన్ని వైద్య సేవలు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి బాధితుడికి నిరంతర పర్యవేక్షణతో మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. బాధితుడి చికిత్సలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు. కోట ఏసు రత్నం కుటుంబానికి సమతా సైనిక దళ్, సమత ఫౌండేషన్ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు సభ్యులు చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, శ్రీనివాస్, బాధితుని కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com